



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 46 | శుక్రవారం 11 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## ఐదు దేశాల పర్యటనను ముగించుకుని భారత్‌కు చేరుకున్న మోదీ

- 8 రోజుల విదేశీ పర్యటన ముగించుకుని భారత్‌కు వచ్చిన ప్రధాని
- ఒకే పర్యటనలో మూడు దేశాల అత్యున్నత పురస్కారాలు
- 2014 నుంచి మోదీకి ఇప్పటివరకు 27 అంతర్జాతీయ పురస్కారాలు

2లో



- కర్ణాటకలో ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య వ్యాఖ్య
- నాయకత్వ మార్పుపై వస్తున్న ప్రచారంలో నిజం లేదని వెల్లడి
- ముఖ్యమంత్రి పదవి పంపకాలపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న సిద్ధరామయ్య
- ప్రస్తుతం కుర్చీ ఖాళీగా లేదని డీకే శివకుమారే అన్నారని గుర్తు చేసిన సిద్ధరామయ్య

# నో వేకన్సీ ఫర్ సీఎం సీటు

బెంగళూరు –సూర్య వాస్తవం, జూలై 10:

కర్ణాటక ముఖ్యమంత్రి పదవి మార్పుపై కొంత కాలంగా కొనసాగుతున్న ఊహాగానాలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒక్క ప్రకటనతో తెరదించారు. రాష్ట్రానికి ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవిని అప్పగించేందుకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరినట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఒక జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిద్ధరామయ్య మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి పదవిలో

- మిగతా 2లో..





## ఢిల్లీలో భూకంపం

### - రిక్టర్ స్కేలుపై 4.1గా తీవ్రత గుర్తింపు

ఢిల్లీ –సూర్య వాస్తవం, జూలై 10:

ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున 4.1గా తీవ్రతతో భూకంపం సంభవించింది. కొద్ది సెకన్ల పాటు భూమి కపించింది. హర్యానా రోహతక్ వద్ద భూకంప కేంద్రాన్ని అదికారులు గుర్తించారు. హర్యానాలోని ఝజ్జర్ జిల్లాలో ప్రకంపలు చోటుచేసుకున్నాయి. నోయిడా, గురుగ్రామ్‌లోని కార్యాలయాల్లో కూడా ప్రకంపనలు సంభవించాయి. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, షామ్లీ వరకు ప్రకంపనలు సంభవించాయి. భయంతో ఇండ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు. ఆస్తి, ప్రాణ నష్టం గురించి ఇంకా వివరాలు తెలియలేదు.




# పాఠశాల ఓ దేవాలయం

- తల్లితండ్రుల తర్వాత ఉపాధ్యాయుడిని గౌరవించాలి
- లోకేష్ పాఠశాలలో ఉన్నప్పుడు నేను పేరెంట్స్ మీటింగ్‌కు వెళ్లలేకపోయా
- మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో సీఎం చంద్రబాబు

శ్రీ సత్యసాయి బ్యూరో –సూర్య వాస్తవం, జూలై 10:

పాఠశాల అనేది దేవాలయం లాంటిదని విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వచ్చే విద్యార్థిని విద్యార్థులు పాఠశాలను కూడా దేవాలయం తో సమానంగా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో తల్లితండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్న విద్యా శాఖ మంత్రి లోకేష్ ను అభినందిస్తున్నానని అన్నారు.తల్లితండ్రుల తర్వాత ఉపాధ్యాయుడినే ఆరాధించటం మన సంప్రదాయమని అందువల్ల గురువును పూజించడం మనం ఆనవాయితీగా




తీసుకోవాలన్నారు.గురుపౌర్ణమి రోజున రాష్ట్రవ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మందితో ఈ సమావేశం నిర్వహించుకోవడం సంతోషదాయకమని కొనియాడారు.లోకేష్ పాఠశాలలో ఉన్నప్పుడు పేరెంట్స్ మీటింగ్ నేను ఎప్పుడూ వెళ్లలేకపోయానని, నా సతీమణి భువనేశ్వరి ఏ సమావేశాన్నీ విడిచిపెట్టకుండా వెళ్లి లోకేష్‌ను

- మిగతా 2లో..

'బంగారు పాళ్యం వైసీపీ నాయకులు

## మామిడికాయ సినిమాను రక్తి కట్టించారు

- తోతాపురి రైతుల కష్టాలపై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవేదన
- కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శ
- బంగారుపాళ్యంలో జగన్ పర్యటన ఓ రాజకీయ డ్రామా అని ఆరోపణ
- జగన్‌కు కూటమి ప్రభుత్వం, పోలీసులు సహకరించారని సంచలన వ్యాఖ్య
- రైతుల సమస్యపై తక్షణం ఉన్నత స్థాయి కమిటీ వేయాలని డిమాండ్



అమరావతి – సూర్య వాస్తవం, జూలై 10

రాష్ట్రంలో అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య "నువ్వు కొట్టినట్లు చెయ్యి, నేను ఏడ్చినట్లు చేస్తా" అన్నట్లుగా వ్యవహారం నడుస్తోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. ఒకవైపు తోతాపురి మామిడి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా

# పాఠ్యాంశాల్లో సమూల మార్పులు..

- పాఠశాలల అభివృద్ధిలో పూర్వవిద్యార్థులు భాగస్వాములు కావాలి
- నైపుణ్యాల పెంపుదలకు లీప్ పేరుతో ఏపి మోడల్ స్కూలు ఎడ్యుకేషన్
- విలువలతో కూడిన విద్యకోసం చాగంటి కోటేశ్వరరావు ద్వారా పుస్తకాలు..
- కొత్తచెరువు మెగా పిటిఎం కార్యక్రమంలో విద్య, ఐటిశాఖల మంత్రి లోకేష్

శ్రీ సత్య సాయి బ్యూరో (సూర్య వాస్తవం) జూలై 10

ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములై విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జిల్లాపరిషత్ హైస్కూలులో గురువారం నిర్వహించిన మెగా పిటిఎం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి విజయం వెనక ఒక టీచర్ ఉంటారు. బ్లాక్ బోర్డ్ మీద చాక్ పీస్ తో అక్షరాలు రాసి ఛాంపియన్స్ ని తయారు చేస్తారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో చదువుతో పాటు జీవిత పాఠాలు నేర్పుతారు.

స్టూడెంట్ ర్యాంక్ కొడితే టీచర్ కి ఆనందం, స్టూడెంట్ కి ఉద్యోగం వస్తే టీచర్‌కి పండగ. అందుకే మనం ఎంత ఎత్తుకి ఎదిగిన మనకి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయు లను, మనం చదువుకున్న స్కూల్ ని జీవితాంతం మర్చిపోకూడదు. కొత్తచెరువు గ్రామానికి ఓ ప్రత్యేక ఉంది. జిల్లానే కాదు మన గ్రామానికి ప్రత్యేకత ఉంది. ఎన్టీఆర్ ను బర్తరఫ్ చేస్తే ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి



ఇద్దరు పోరాడి ప్రాణాలు కోల్పోయారు.

**త్వరలోనే కొత్త టీచర్ల నియామకం**

నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకుని నిలబడేలా కెజి నుంచి పిజివరకు పాఠ్యాంశాల్లో సమూల మార్పులు తెస్తున్నాం. గతంలో కేవలం 1200 మాత్రమే వన్ క్లాస్ – వన్

- మిగతా 2లో..



## మామిడి రైతులకు కష్టాలే లేనట్టుగా మాట్లాడుతున్నారు

- చంద్రబాబుపై జగన్ విమర్శలు
- మామిడి రైతులపై తప్పుడు రాతలు రాయడం సిగ్గుచేటు అంటూ జగన్ విమర్శ
- నిరసన తెలిపిన రైతులను రౌడీలుగా చిత్రీకరించడం దారుణమని వెల్లడి
- మీ ఫ్యాక్టరీల కోసమేనా ఈ కుట్ర అంటూ సర్కారుపై జగన్ ఆరోపణల వర్షం

అమరావతి – సూర్య వాస్తవం, జూలై 10

మామిడి రైతుల సమస్యలపై నిరసన తెలుపుతున్న వారిని రౌడీషీటర్లుగా, అసాంఘిక శక్తులుగా చిత్రీకరిస్తున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయనకు మద్దతిస్తున్న ఎల్లో మీడియా సంస్థలు మరింతగా దిగజారి

- మిగతా 2లో..

# ఐదు దేశాల పర్యటనను ముగించుకుని భారత్‌కు చేరుకున్న మోదీ

- 8 రోజుల విదేశీ పర్యటన ముగించుకుని భారత్‌కు వచ్చిన ప్రధాని
- ఒకే పర్యటనలో మూడు దేశాల అత్యున్నత పురస్కారాలు
- 2014 నుంచి మోదీకి ఇప్పటివరకు 27 అంతర్జాతీయ పురస్కారాలు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 10**

ప్రధాని మోదీ తన ఎనిమిది రోజుల విదేశీ పర్యటనలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఒకే పర్యటనలో ఏకంగా మూడు దేశాల అత్యున్నత పౌర పురస్కారాలను స్వీకరించిన ఆయన, తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా బ్రెజిల్, నమీబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలను ప్రధాని మోదీకి అందించి సత్కరించాయి. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోదీ విదేశీ ప్రభుత్వాల నుంచి అందుకున్న అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య దీనితో 27కు చేరింది. మొత్తం 8 రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాతో సహా ఐదు దేశాలను సందర్శించారు. గ్లోబల్ సౌత్‌లో భారతదేశ ప్రభావాన్ని పెంచడం, ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేయడం, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యాలు. బ్రెజిల్‌లో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న మోదీ.. ప్రపంచ ఆర్థిక పాలన, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. అలాగే, అర్జెంటీనాతో వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, రక్షణ రంగాల్లో సహకారంపై చర్చించగా.. ఘనా, నమీబియా దేశాల్లో మౌలిక వసతులు, విద్యా భాగస్వామ్యాలపై దృష్టి సారించారు. కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడ్డాయి.

# మామిడి రైతులకు కష్టాలే లేనట్టుగా మాట్లాడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

పోయా యంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి, ఆ మీడియాకు ఉన్న బాధ్యతారాహిత్యం, తేలికభావం ఈ వక్రీకరణలతో బయటపడిందని మండిపడ్డారు.

**బంగారుపాళ్యం ఘటనపై వక్రీకరణలా?**

బంగారుపాళ్యంలో తాను చేపట్టిన పర్యటనకు ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా, వందల మందికి నోటీసులు ఇచ్చి నిర్బంధించినా వేలాదిగా రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చారని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై రైతుల్లో ఉన్న ఆగ్రహాన్ని రాష్ట్రమంతా చూసిందన్నారు. ఈ క్రమంలో, తమకు జరుగుతున్న తీవ్ర నష్టాన్ని దేశం దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో కొందరు రైతులు రోడ్లపై మామిడికాయలు పోసి నిరసన తెలిపారని, దీనిని నేరంగా చూపిస్తూ రైతులను, వారికి మద్దతిస్తున్న ప్రతిపక్షాన్ని దొంగలుగా చిత్రీకరించడం సిగ్గుచేటని అన్నారు. "మామిడి రైతులకు కష్టాలే లేనట్టు, వారంతా ఆనందంతో కేరింతలు కొడుతున్నట్టు మీరు రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. ఇంతకన్నా నిస్సిగ్గుతనం ఉంటుందా? పాలకుడినని చెప్పుకోవడానికి చంద్రబాబుకు, పత్రికలమని చెప్పుకోవడానికి మీ ఎల్లో మీడియాకు సిగ్గుండాలి?" అని జగన్ తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

**మీ చర్యలే నష్టాలకు నిదర్శనం**

మామిడి రైతులు నిజంగా కష్టాల్లో లేకపోతే, ప్రభుత్వం ఎందుకు కిలోకు రూ.4 ఇస్తామని ప్రకటించిందని జగన్ నిలదీశారు. ఫ్యాక్టరీలు కిలో రూ.8 చొప్పున కొనాలని దొంగ ఆదేశాలు ఎందుకు జారీ చేశారని ప్రశ్నించారు. తన పర్యటన ఖరారు కాగానే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని ఢిల్లీకి ఎందుకు పంపారని అడిగారు. కర్ణాటకలో కిలో మామిడిని రూ.16 కనీస మద్దతు ధరకు కొంటామని కేంద్ర ప్రభుత్వం, ఎన్డీయే భాగస్వామి జేడీఎస్ నేత కుమారస్వామికి లేఖ రాయడాన్ని ఆయన గుర్తుచేశారు. "ఒకవైపు రైతులు నష్టపోతున్నారని మీరే అంగీకరిస్తూ, ఆ నష్టాన్ని మేం ఎత్తిచూపితే మాపై, రైతులపై ఈ దౌర్భాగ్యపు మాటలు, రాతలు ఎందుకు?" అని జగన్ నిలదీశారు.

**మా పాలనతో పోల్చుకోండి**

గత ఏడాది తమ ప్రభుత్వ హయాంలో మామిడికి కిలోకు రూ.25 నుంచి రూ.29 వరకు ధర లభించిందని, కానీ ఈ ప్రభుత్వం వచ్చాక ధరలు దారుణంగా పడిపోయాయని జగన్ విమర్శించారు. ప్రతి ఏటా మే 15లోగా తెరుచుకోవాల్సిన పల్ప్ ఫ్యాక్టరీలను నెలరోజులు ఆలస్యంగా, అదీ కొన్నింటిని మాత్రమే ఎందుకు తెరిచారని ప్రశ్నించారు. "మీ గల్లా ఫ్యాక్టరీకి, మీ శ్రీని ఫుడ్స్‌కు మేలు చేయాలన్న ఉద్దేశంతోనే ఉద్దేశపూర్వకంగా దోపిడీకి ఆస్కారం కల్పించడం లేదా?" అని ఆయన ఆరోపించారు. కిలోకు రూ.2.5 నుంచి రూ.3కు రైతులు అమ్ముకుంటున్న దయనీయ పరిస్థితిని ప్రస్తావిస్తూ, దీనిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**అన్ని పథకాలకూ మంగళం పాడారు**

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వరి నుంచి మామిడి వరకు ఏ పంటకూ కనీస మద్దతు ధర రావడం లేదని జగన్ ఆరోపించారు. తమ హయాంలో రూ.3 వేల కోట్లతో ఏర్పాటు చేసిన ధరల స్థిరీకరణ నిధితో రూ.7,800 కోట్లు ఖర్చు చేసి రైతులను ఆదుకున్నామని, ఈ ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా వంటి పథకాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఆర్బీకేలు, ఈ-క్రాప్, టెస్టింగ్ ల్యాబ్‌ల వంటి వ్యవస్థలను నిర్వీర్యం చేసి రైతులకు అండగా ఉండే ప్రతి కార్యక్రమాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని రైతులకు తోడుగా నిలబడాలని చంద్రబాబుకు జగన్ హితవు పలికారు.

# మామిడికాయ సినిమాను రక్తి కట్టించారు

(మొదటిపేజీ తరువాయి)

రైతులు ధరలు పతనమై కన్నీరు పెడుతుంటే, మరోవైపు ఈ రెండు పార్టీలు రాజకీయ డ్రామాలకు తెరలేపాయని ఆమె సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.

బంగారుపాళ్యంలో వైఎస్ జగన్ పర్యటనను ఆమె ఓ పెద్ద నాటకంగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వ దర్శకత్వంలో, పోలీసుల సహకారంతో ఈ "బంగారుపాళ్యం వైసీపీ మామిడికాయ సినిమా"ను రక్తి కట్టించారని ఎద్దేవా చేశారు. పరామర్శల పేరుతో వేలాది మందితో బలప్రదర్శన చేస్తుంటే, ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించిందని విమర్శించారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడు కావడం, వారి మధ్య అక్రమ పొత్తు ఉండటం వల్లే రాష్ట్రంలో ఆయనకు పూర్తి స్వేచ్ఛ లభిస్తోందని, అందుకే ఎలాంటి చర్యలు ఉండటం లేదని షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. తోతాపురి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని షర్మిల దుయ్యబట్టారు. కిలోకు 16 రూపాయలు ఇస్తే తప్ప తాము కోలుకోలేమని రైతులు వేడుకుంటుంటే, మార్కెట్లో 4 రూపాయలకు మించి ధర పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం 12 రూపాయలు ఇచ్చి న్యాయం చేశామని అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. ఇది రైతుల కోసం జగన్ చేస్తున్న పోరాటం కాదని, కేవలం డబ్బుతో కూడిన బలప్రదర్శన అని షర్మిల స్పష్టం చేశారు. రైతులపై జగన్ కనబరుస్తున్నది మొసలి కన్నీరేనని ఆమె వ్యాఖ్యానించారు. తోతాపురి రైతుల సమస్యలపై తక్షణం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# పాఠశాల ఓ దేవాలయం

(మొదటిపేజీ తరువాయి)

కేంబ్రిడ్జి వరకూ చదివించటంలో శ్రద్ధ వహించారని గుర్తు చేశారు. డ్వాక్రా సంఘాలకు పొదుపు నేర్పించి కుటుంబ ఆదాయం పెరిగేలా చేశామన్నారు. మహిళల పొదుపు కోసం బలమైన వ్యవస్థకు రూపకల్పన చేసి అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చామన్నారు. కుటుంబంలో ఉన్న ప్రతీ పిల్లవాడినీ చదివించాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకాన్ని అందరికీ వర్తింప చేశామని, కుటుంబంలో ఎంతమంది ఉన్నా వారందరికీ ఈ పథకాన్ని అందించి ఆ కుటుంబాల్లో వెలుగులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాశాఖ బాధ్యతను లోకేష్ ఏరికోరి తీసుకున్నారని, విద్యా సంస్థలో చదువుకున్న లోకేష్ రాష్ట్రంలోని విద్యార్థులందరి భవిష్యత్తు తీర్చిదిద్దుతారనే నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించామని వివరించారు. మొదటిసారి పేరెంట్ టీచర్ మీటింగ్ ను 44 వేల పైచిలుకు పాఠశాలల్లో నిర్వహించామని ఈసారి ప్రైవేటు స్కూళ్లలోనూ వీటిని నిర్వహించాలని ఆదేశించి నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రైవేటు స్కూల్లకు ధీటుగా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. నెల్లూరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో సీట్లు ఖాళీలేవని నో అడ్మిషన్స్ బోర్డు పెట్టారంటే నాణ్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని,
ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కూడా అత్యుత్తమ నైపుణ్యం కలిగిన వారని అన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0కు 2.28 కోట్ల మంది హాజరయ్యారని ఇలాంటి కార్యక్రమాలను రాబోయే కాలంలో కూడా కొనసాగిస్తామన్నారు గిన్నీస్ రికార్డు సాధించేలా ఈ కార్యక్రమాన్ని చేపడతా మన్నారు. తల్లిపేరిట ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకున్నాం. వారికి గ్రీన్ పాస్ పోర్టు కూడా ఇచ్చామని, తల్లితండ్రులు లీప్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు, వారికి వచ్చిన మార్కులు , ప్రవర్తన అన్నీ యాప్ ద్వారా సమాచారం ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన యూనిఫాం, బూట్లు, బెల్టు, బ్యాగ్ అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మీకు కల్పిస్తున్న సౌకర్యాలను చూసి నాకూ కూడా చదువుకోవాలని ఉందన్నారు. విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై ఎలాంటి వ్యక్తుల ఫోటోలు పెట్టలేదని, రూ.980 కోట్లు వీటి కోసం వ్యయం చేశామని వివరించారు.

ఇప్పుడు మీకు ఆ ఇబ్బంది లేకుండా నాణ్యమైన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, విద్యాశాఖను మెరుగు పర్చడానికి తల్లితండ్రులు, ఉపాధ్యాయుల అందరి సూచనలూ తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖ ఏజెన్సీలో గంజాయి పెద్ద ఎత్తున పండించారని, డ్రగ్స్, గంజాయి విక్రయించినా పండించినా అదే వారికి చివరి రోజు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం పై అవగాహన తీసుకురావడంలో భాగంగానే డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా దీన్ని నియంత్రించే డ్రగ్స్ , గంజాయి విక్రయించే వారి ఆస్తిని కూడా స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ , గంజాయి విక్రయించేవారి కుటుంబాలకు ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలను కూడా నిలుపుదల చేస్తామని, విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులు మనకు స్ఫూర్తి కావాలన్నారు.

గతంలో 12 సార్లు డీఎస్సీలు విడుదల చేసి 1.66 లక్షల మందిని ఉపాధ్యాయులను నియమించా మన్నారు. గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీని కూడా విడుదల చేయలేదని అధ్యాపకులు లేకుండా సంస్కరణలు ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో టోఫెల్ అన్నారు... ఐబీ సిలబస్ అన్నారు... ఒక్కటి కూడా అమలు కాలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగాడీఎస్సీ నిర్వహించి 16,347 మంది ఉపాధ్యాయులను నియమిస్తున్నామన్నారు. ఆగస్టు నాటికల్లా వారంతా పాఠశాలలకు వస్తారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని స్పష్టం చేశారు. 40 లక్షల మంది పైచిలుకు తల్లులకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు వారి అకౌంట్లో జమ చేశామని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని.. దాని అసలు తీర్చి, వడ్డీలు కట్టాలంటే తల ప్రాణంతో తోకకు వస్తుందన్నారు. ఇన్ని ఇబ్బందులు ఉన్నా మీకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ అని అవార్డులు ఇస్తున్నామన్నారు. షైనింగ్ స్టార్స్ ఉన్న విద్యార్థుల అందరికీ నచ్చిన కాలేజీల్లో చదువుకునేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

పుట్టపర్తిలో స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసి అభివృద్ధికి దోహదపడతామన్నారు. ఇక అంతా హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ చేయాలని, ఐటీ వల్ల మన తెలుగువాళ్లు దేశవిదేశాల్లో బాగా సంపాదించగలు గుతున్నారని, పిల్లలను బాగా చదివిస్తే ఊహించని విధంగా వారి జీవితాల్లో మార్పు వస్తుందని గుర్తు చేశారు, భవిష్యత్ అంతా నాలెడ్జ్ ఎకానమీదేనాని దానికి అనుగుణంగా మన విద్యార్థులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ కోనా శశిధర్ ఎంపీ బికె పార్థసారథి ఎమ్మెల్యే సింధూర రెడ్డి విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా

# పాఠ్యాంశాల్లో సమూల మార్పులు..

(మొదటిపేజీ తరువాయి)

టీచర్ పాఠశాలలు ఉండగా, ఇప్పుడు తరగతికొక ఉపాధ్యాయుడు ఉండేలా 9,600 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటుచేశాం. బ్యాగ్ బరువు తగ్గించేందుకు సెమిస్టర్ వారీగా పుస్తకాలను రూపొందించాం. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఎకౌంట్లలో ?10 వేల కోట్లు జమచేశాం. సమగ్ర అభ్యాసం, విద్యా నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా చేసుకుని మేము %లాజూూా% (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఆంధ్ర మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టాం. దేశంలోనే అతిపెద్ద నియామకాలలో ఒకటైన మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించాం, ఆగస్టు నెలాఖరులోగా 16,347మందికి నియామక ఉత్తర్వులు అందజేయ బోతున్నాం. పేదరికాన్ని రూపుమాపే ఆయుధం విద్య పేదరికం నుండి బయటకు తెచ్చే ఒకే ఒక్క ఆయుధం విద్య అని మేము బలంగా నమ్ముతున్నాం. జ్ఞానం అంతిమ లక్ష్యం స్వేచ్ఛ... సంస్కృతి అంతిమ లక్ష్యం పరిపూర్ణత... జ్ఞానం అంతిమ లక్ష్యం ప్రేమ... విద్య అంతిమ లక్ష్యం శీలం...ఇది చెప్పింది భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గారు. గురుపౌర్ణమి రోజు భగవాన్ శ్రీ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న ఈ మెగా %లుువీ% కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో మరిచిపోలేని రోజు ఇది. ఎపి విద్యారంగ చరిత్రలోనే సరికొత్త రికార్డు మన మెగా పిటిఎం 2.0. నేను చదువుకునే రోజుల్లో మా స్కూలులో పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగేది. కానీ మా నాన్న బిజీగా ఉండటం వల్ల ఎప్పుడు హాజరయ్యేవారు కాదు. ఎప్పుడూ మా అమ్మే వచ్చేవారు. ఇప్పుడు దేవాంశ్ చదువుతున్న స్కూల్లో పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగితే వెళ్లడానికి నాకు కుదరడం లేదు, బ్రాహ్మణి వెళుతుంది. కానీ ఈ రోజు మా నాన్న గారు, నేను ఇద్దరం లక్షల మంది పిల్లలు హాజరైన మెగా పిటిఎం 2.0కి వచ్చాం.

**నాణ్యమైన విద్య అందిస్తున్నాం**

మాతృ దేవో భవ... అమ్మ అంటే రెండు అక్షరాలు కాదు... కనిపించే దేవత. అమ్మ అంటే ధైర్యం. మనకి నడక నేర్పేది అమ్మ, మనకి బాధ్యత నేర్పేది అమ్మ. మన భవిష్యత్తు కోసం జీవితాన్ని త్యాగం చేసింది అమ్మ. ఇక్కడ ఉన్న తల్లులు అందరికి వందనం. అందుకే ముఖ్యమంత్రి గారు కేవలం డబ్బులు ఇవ్వడం కాదు, గౌరవం నిలపాలని చెప్పారు. అమ్మను గుండెల్లో పెట్టుకొని కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనే ఉంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వవిద్యను తయారుచేయాలని చెప్పారు. అందుకే పుస్తకాలు, యూనిఫాంలు, షూలు నాణ్యమైనవి ఇచ్చాం. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరిస్తే ఎటువంటి ఆర్థిక భారం ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్ట్, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారు, నాణ్యమైన విద్య అందిస్తున్నాం. చిన్నారులను బాయిలర్ కోళ్లలా కాకుండా వారి సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల్లో ఆటలు, పాటలు, యోగా అన్నీ నేర్పిస్తున్నాం. పది, ఇంటర్ ఫలితాల్లో మనవాళ్లు అద్భుతమైన ప్రతిభచాటారు, వారికి షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులు కూడా ఇచ్చాం.

**రాజకీయాలకు అతీతంగా విద్య!**

ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండకూడదు. రాజకీయాలు గేటుబయటే, పాఠశాలలో అడుగుపెట్టడానికి లేదు. విద్యావ్యవస్థలో రాజకీయాలు వద్దు... ఫలితాలపై మాత్రమే దృష్టి పెట్టాలన్నది మా విధానం. గతంలో మాదిరి పార్టీ రంగులు, మా ఫోటోలు విద్యార్థులకు ఇచ్చిన పుస్తకాలు, వస్తువులపై ఎక్కడ కనిపించవు. స్కూల్స్ లో విద్యకు సంబంధించిన కార్యక్రమలు తప్ప ఏ ఇతర కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని ఆదేశాలు ఇచ్చాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఒకే రోజు మెగా పిటిఎం నిర్వహించడం ఒక రికార్డు. 2.30 కోట్ల మంది పాల్గొనే అతి పెద్ద పేరెంట్ టీచర్ మీటింగ్ గా రికార్డ్ సృష్టించబోతోంది. ఉపాధ్యాయులు, తల్లి-దండ్రులు, విద్యార్థులను అనుసంధానం చేయడమే ఈ మెగా పిటిఎం లక్ష్యం. మెరుగైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. మన పిల్లల్లో అద్భుతమైన శక్తి ఉంది, దారి చూపిస్తే ప్రపంచాన్ని శాసిస్తారు, పిల్లలను ప్రయోజకులుగా మార్చే బాధ్యత తీసుకుంటా.
తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలి.

ఉపాధ్యాయులు ఎంత చెప్పినా, పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత తల్లి-దండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. పిల్లలకి ఈ రోజు స్కూల్లో ఏం పాఠాలు చెప్పారు, హోంవర్క్ చేసారా,లేదా అనేది గమనించాలి. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని తెలియజేసే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్నాం. ఈ కార్యక్రమములో తల్లి-దండ్రుల నుండి అభిప్రాయాన్ని తీసుకుంటాం. గౌరవ ప్రధాని నరేంద్ర మోడీజీ ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మపేరుతో ఒక మొక్క నాటాలని) పిలుపునిచ్చారు, నాకు అన్న సమానమైన పవనన్న కోటిమొక్కలు నాటాలని సవాల్ విసిరారు. ఆయన సవాలు నేను స్వీకరిస్తున్నా. ఒక విద్యాశాఖ ద్వారానే కోటిమొక్కలు నాటే బాధ్యత స్వీకరిస్తాం. గ్రీన్ పాస్ పోర్టులో మూడేళ్లపాటు మొక్క పరిరక్షణ వివరాలు పొందుపరుస్తాం. బాధ్యత పెంచేందుకే పిల్లలకు గ్రీన్ పాస్ పోర్టులు ఇస్తున్నాం. ఈ కార్యక్రమం లో భాగంగా సుమారు 45 లక్షల మంది విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్నాం.

**కష్టమైన మార్గాన్నే ఎంచుకోండి**

జీవితంలో ఎల్లప్పుడూ కష్టతరమైన మార్గాన్నే ఎంచుకోండి. చిన్నచిన్న విషయాలకే విద్యార్థులు కుంగిపోకూడదు. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితంలో లక్ష్యసాధనకు ముందుకు సాగాలి. ఒక సబ్జెక్టులో ఫెయిలయ్యారని పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆ ఫెయిల్యూర్ మనలో కసి, పట్టుదల పెంచాలి కానీ, అధైర్యపడకూడదు. నాకు విద్యాశాఖ కేటాయిస్తున్నారనే వార్త రాగానే చాలా మంది శ్రేయోభిలాషులు ఫోన్ చేసి, ఆశాఖ తీసుకోవద్దని సలహా ఇచ్చారు. రోజూ తలనొప్పులతో కూడిన సంక్లిష్టమైన డిపార్ట్‌మెంట్ అని చెప్పారు. కానీ నేను ఎప్పుడూ సవాళ్లను ఇష్టపడతాను. నేను తొలిసారి పోటీకి ఎంచుకున్న మంగళగిరిలో టీడీపీ అంతకుముందు 37 సంవత్సరాలుగా గెలవలేదు. మొదటి ప్రయత్నంలో నేను ఓడిపోయాను, అయినప్పటికీ నేను అయిదేళ్లు ప్రజలకు సేవచేస్తూనే ఉన్నాను. ఫలితంగా గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నేను రాష్ట్రంలో మూడవ అత్యధిక మెజారిటీతో గెలిచాను. విద్యాశాఖ మంత్రిగా అద్భుతమైన సంస్కరణలు తెచ్చాం.

**విద్యాశాఖను సవాలుగా స్వీకరించా!**

ఇప్పుడు విద్యాశాఖ నా ముందున్న పెద్ద సవాలు. గత ఏడాది కాలంగా నేను ఈ శాఖలో నెలకొన్న ప్రాథమిక అంశాలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాను. నేను బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన గణాంకాలు కూడా సరిగాలేవు. విద్యా మంత్రిగా నా ప్రయాణం అక్కడ నుంచే ప్రారంభమైంది. కెజి నుంచి పిజివరకు విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం. గతంలో చిక్కీల నుండి గుడ్లు, యూనిఫాంలు, పాఠశాల గోడల వరకు ప్రతిదీ రాజకీయ పార్టీ రంగులు, నాయకుల ఫోటోలతో నిండి ఉండేది. ఇప్పుడు మేము భారతీయ విద్యకు నిజమైన చిహ్నం అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరు మీద అధిక-నాణ్యత గల విద్యా కిట్‌లను అందిస్తున్నాము. గతంలో చిక్కీలు, గుడ్లు, మధ్యాహ్నభోజనంలో నాణ్యత లేదు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. గత పిటిఎం సందర్భంగా సిఎం సన్నబియ్యంతో భోజనం పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆయన సూచనమేరకు డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నాం. విద్యార్థుల్లో పౌష్టికాహారం కోసం అన్నిప్రభుత్వ పాఠశాలలకు రాగి జావను ఉచితంగా అందిస్తున్న భగవాన్ శ్రీ సత్య సాయి ట్రస్ట్‌ను అభినందిస్తున్నాను.

**మహిళలను గౌరవించేలా పాఠాలు**

మొదటిసారిగా విలువ ఆధారిత విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించాం. కాలం మారింది, విలువలు పడిపోయయి, విలువలతో కూడిన విద్య అందించాలని చంద్రబాబు చెప్పారు. చాగంటి కోటేశ్వరరావును కేబినెట్ ర్యాంకుతో సలహాదారుగా నియమించాం. ఎటువంటి సౌకర్యాలు అవసరం లేదని చెప్పారు. అటువంటి వ్యక్తి నాయకత్వంలో ప్రత్యేకంగా పుస్తకాలు తయారుచేసి అందిస్తున్నాం. సమాజంలో ఇప్పటికీ మహిళలపై దాడులు జరుగుతున్నాయి. మార్పు ఇంటినుంచే మొదలు కావాలి. గాజులు తొడుక్కువా, అమ్మాయిలా ఏడవొద్దు వంటి పదాలు వాడకూడదు. 1,2 తరగతుల టెక్స్ట్ బుక్ లో ఇంటిపనుల బొమ్మలను చెరోసగం ఉండేలా చర్యలు తీసుకున్నాం. మార్పు మన మనసు నుంచి, మన ఇంటినుంచి రావాలి. పాఠశాలల్లో విలువలను బోధించడానికి ఆయన ద్వారా ప్రత్యేక పుస్తకాలు, వీడియోలను అభివృద్ధి చేసి అందిస్తున్నాం. తరగతి గది స్థాయి నుండే మహిళల పట్ల గౌరవం పెంపొందించే పాఠ్యాంశాలను పొందుపర్చాం.

పాఠశాలల్లో యోగా, క్రీడలను ప్రోత్సహించడానికి ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించాం. ప్రధాని నేతృత్వంలో ఒకేసారి 3లక్షలమందితో యోగాంధ్ర నిర్వహించి నిర్వహించి రికార్డు సృష్టించాం. టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చి 67,732 మంది ఉపాధ్యాయ బదిలీలు, 4,477 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాం.

## సంపాదకీయం

# బ్రిక్స్‌పై అగ్రరాజ్యం అక్కసు



బ్రిక్స్ దేశాలపై ఇప్పటికే ట్రంప్ కన్నెర్రచేశారు. అమెరికా విధానాలను వ్యతిరేకించే దేశాలపై 10శాతం అదనపు సుంకం తప్పదంటున్నారు. అయితే ట్రంప్ ఏకపక్ష టారిఫ్‌లను వ్యతిరేకించాయి బ్రిక్స్ దేశాలు. బ్రిక్స్ ప్రకటనపై భారత్ కూడా సంతకం చేసింది. రియో డిక్లరేషన్‌పై రియాక్షయిన ట్రంప్..బ్రిక్స్ దేశాలను వదిలేది లేదంటూ హెచ్చరికలు జారీ చేశారు.కొన్ని దేశాల పెడధోరణులను బ్రిక్స్ వేదికగా దునుమాడటంలో భారత్ ఎప్పుడూ ముందువరుసలో ఉంటుంది. ఈసారీ అదే సాంప్రదాయం కొనసాగింది. బ్రెజిల్ రాజధాని రియోడీ జనిరోలో జరిగిన సదస్సులో దక్షిణార్ధ గోళానికి (గ్లోబల్ సౌత్) జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టడంలోనూ, ఉగ్రవాదంపై గోడమీది పిల్లివాటం ప్రదర్శిస్తున్న పలుదేశాల వైఖరిని తూర్పారబట్టడంలోనూ భారత ప్రధాని ఏమాత్రం వెనుకాడలేదు సరికదా, ఈసారి అంతర్జాతీయ సంస్థలు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను సైతం కడిగి పారేశారు. రెండు అగ్రదేశాల ప్రతినిధులు.. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ గైర్హాజరైన ఈ సదస్సును ముందుకు నడిపించడంలో ఆతిథ్య దేశం బ్రెజిల్‌తో కలిసి భారత్ కీలకపాత్ర పోషించింది.భద్రతామండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వంటి అంతర్జాతీయ సంస్థలు తమను తాము సంస్కరించుకోవలసిన ఆవశ్యకతను ప్రధాని చాటిచెబుతూ, 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను 20వ శతాబ్దపు టైప్ రైటర్లతో నడపలేమని చురకలంటించారు.బ్రిక్స్ కూటమిపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి నోరు పారేసుకున్నారు. అమెరికాను ఇబ్బంది పెట్టడానికి, డాలరును దెబ్బకొట్టడానికే బ్రిక్స్ ఏర్పాటైందని ఆయన మండిపడ్డారు. బ్రిక్స్ కూటమిలోని దేశాలపై 10శాతం సుంకాలను విధిస్తామని ట్రంప్ మరోసారి వార్నింగ్ ఇచ్చారు. 'వారు ఆటలాడటానికి ప్రయత్నిస్తే నేనూ ఆడతా. ఎవరైనా బ్రిక్స్‌లో ఉంటే వారిపై 10శాతం సుంకాలు తప్పవు. బ్రిక్స్ ఇప్పటికే చీలిపోయింది. ఒకరిద్దరు మాత్రమే బ్రిక్స్‌లో ఉన్నారు. వాస్తవానికి బ్రిక్స్‌తో పెద్ద ముప్పేమీ లేదు. కానీ వారు డాలరును ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అనుమానం కలుగుతోంది. డాలర్ విలువను కోల్పోవడానికి సిద్ధంగా లేం. ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన భారత్‌కు భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం ఇప్పటికీ అందని ద్రాక్షగా ఉందన్న విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులమందికి ఆయా సంస్థల్లో ప్రాతినిధ్యం లభించడం లేదని మండిపడ్డారు. దక్షిణార్ధ గోళానికి తగిన ప్రాముఖ్యం ఇవ్వలేని సంస్థలు సిమ్ కార్డు ఉండీ నెట్‌వర్క్ లేని మొబైల్ ఫోన్లవంటివేనని ఎద్దేవా చేశారు. ఇదే సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై జరిగిన సమావేశంలో ప్రధాని పహల్గాం ఉగ్రదాడిని నేరుగా ప్రస్తావిస్తూ, ఉగ్రవాదానికి ఊతమిచ్చేవారిని, దానివల్ల నష్టపోయేవారినీ ఒకే గాటన కట్టకూడదని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ సభ్యత్వ దేశాలు ముక్తకంఠంతో ఖండించడం ఆహ్వానించదగిన పరిణామం. రియో డీ జనీరో వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతుండగానే అగ్రరాజ్యాధినేత అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు ఇచ్చే బ్రిక్స్ దేశాలపై అదనంగా 10 శాతం పన్నులు విధిస్తామంటూ బెదిరింపులకు దిగడం ఆయన తెంపరితనానికి అద్దం పడుతోంది. బ్రిక్స్ దేశాలపై అమెరికాకు ఏనాటినుంచో కడుపుమంట ఉంది. సుమారు పాతికేళ్ల క్రితం బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలతో 'బ్రిక్'గా ఏర్పడిన ఈ కూటమి ఇంతై, వటుడింతై అన్న రీతిలో అంతకంతకూ విస్తరిస్తోంది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో 'బ్రిక్స్'గా పేరుమార్చుకున్న ఈ కూటమి ఇటీవలే ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకూ చోటు కల్పించింది. బ్రిక్స్ ప్రాధాన్యాన్ని గమనించిన మరో 20కి పైగా దేశాలు ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి.బ్రిక్స్‌ను పాశ్చాత్య దేశాల ఆధిపత్యానికి తెరదించేందుకు ఏర్పడిన కూటమిగా అమెరికా, ఇతర ఐరోపా దేశాలూ భావిస్తున్నాయి. ముఖ్యంగా కూటమిలో చైనా, భారత్ ప్రాబల్యం పెరగడాన్ని అగ్రరాజ్యం జీర్ణించుకోలేకపోతోంది. డాలర్ పై ఆధారపడకుండా ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న బ్రిక్స్ దేశాల అభిమతాన్ని తప్పుపడుతోంది. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆటలు ఆడాలనుకుంటే తాము వాణిజ్యంతో వారికి చెక్ పెడతామంటూ ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు ఈ కోణంలోంచి అర్థం చేసుకోవాలి. ప్రపంచ జనాభాలో 46 శాతానికి బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రపంచ జిడిపిలో 35 శాతం వాటాను, చమురు ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్న బ్రిక్స్ కూటమిపై పాశ్చాత్య దేశాలు ఎంతోకాలంగా తృణీకార ధోరణి కనబరుస్తున్నాయి. జి7 దేశాలు అమెరికాకు సానుకూలంగా ఉంటే, బ్రిక్స్ మాత్రం ఎటువైపూ ఒరగకుండా, తనదైన రీతిలో స్వతంత్ర ప్రతిపత్తితో ముందుకు సాగుతుండటం అగ్రరాజ్యానికి సైతం మింగుడుపటడం లేదు.బ్రిక్స్ కూటమిలో ఉన్నంతమాత్రాన అమెరికాకు తాను వ్యతిరేకం కాదని తెలియజెప్పేందుకు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలసి భారత్ క్వాడ్ కూటమిగా ఏర్పడిందన్నది గమనార్హం. బ్రిక్స్ కూటమి పాశ్చాత్య దేశాలకు అసూయ పుట్టించేదిగా ఉన్నా, ఈ కూటమి మేడిపండును తలపిస్తోందన్న సంగతిని విస్మరించకూడదు. కూటమిలోని సభ్యత్వ దేశాల మధ్య ఎన్నో రాజకీయ, సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయి. ముఖ్యంగా చైనా భారత్ మధ్య నెలకొని ఉన్న సరిహద్దు వివాదాల వంటివి కూటమి ఐక్యతకు తూట్లు పొడుస్తున్నాయి. బ్రిక్స్

# బాబు అదిరిపోయే స్కెచ్

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఏపీలో కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మూడు పార్టీల కలయిక విషయంలో అనేక రకాల ఇబ్బందులు వస్తాయని నాయకత్వాలకు తెలుసు. అందుకే చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్నాయి మూడు పార్టీలు. ఇప్పుడు తెలుగుదేశం విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట ఇన్చార్జిల నియామకం పై దృష్టి పెట్టింది. 11చోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలవడంతో అక్కడ టిడిపి నాయకత్వాన్ని మరింత పటిష్టం చేయాలని చూస్తోంది. ఇంకోవైపు జనసేనతో పాటు బిజెపి గెలిచిన 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సైతం టిడిపి ఇన్చార్జిలను నియమించేందుకు కసరత్తు ప్రారంభించింది. అయితే ఇక్కడ ఆ రెండు పార్టీల ఎమ్మెల్యేలపై దూకుడు ప్రదర్శించకుండా.. సమన్వయంతో వ్యవహరించే వారికి ఇన్చార్జులుగా నియమించాలని చూస్తోంది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాలు తీసుకుంటోంది.జనసేన తో పాటు బిజెపి గెలిచిన చోట్ల వైసిపి క్యాడర్ పెద్ద ఎత్తున చేరింది. అయితే వారితో ఎన్నికల సమయంలో ఇబ్బందులు తప్పవు. అందుకే క్షేత్రస్థాయిలో బలమున్న టిడిపి క్యాడర్ను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే టిడిపి అధినేత చంద్రబాబు మంచి ఆలోచన చేశారు. అక్కడ జనసేన, బిజెపి ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకునే వారికి ఇంచార్జ్ పదవులు కట్టబెట్టనున్నారు. పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో వర్మ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. అయితే అదే నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం పెద్ద ఎత్తున జనసేనలో చేరింది. వారు అప్పటి సీన్ క్రియేట్ చేసుకున్నారు. దానినే ప్రశ్నిస్తున్నారు వర్మ. అయితే అక్కడ జరుగుతున్న తప్పిదాలను సరిచేసుకునే పనిలో ఉన్నారు పవన్ కళ్యాణ్.



అటువంటి పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా చూడాలన్నది చంద్రబాబు ప్లాన్. అందుకే ఆ రెండు పార్టీల ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకునే.. సమర్థవంతమైన నేతలకి అక్కడ బాధ్యతలు అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.ప్రధానంగా జనసేన ఉభయగోదావరి తో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా విజయం సాధించింది. ఆయా చోట్ల తెలుగుదేశం పార్టీకి బలమైన కేడర్ ఉంది. దానిని కాపాడుకోవడం ఇప్పుడు కూటమికి ఉత్తమం. జనసేన తో పాటు బిజెపికి సీట్లు కేటాయించే నియోజకవర్గాల్లో టిడిపి కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. అది పవన్ కళ్యాణ్ తో పాటు బిజెపి నాయకత్వానికి తెలుసు. అందుకే చంద్రబాబు ఆ రెండు పార్టీల నాయకత్వాలతో ఆలోచన చేస్తున్నారు. టిడిపి ఇన్చార్జ్ ల నియామకంపై కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల.. వారి సిఫారసు తోనే టిడిపి ఇన్చార్జిలను నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.మూడు పార్టీల మధ్య సమన్వయ లోపంతో రాజకీయంగా లబ్ధి పొందాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి వ్యూహంతో ఉంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన చాలామంది నేతలు కూటమి పార్టీల వైపు వెళ్లారు. వారు వచ్చే ఎన్నికల నాటికి తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని ఒక అంచనాలు ఉన్నాయి. పేరుకే వారి కూటమి పార్టీలో చేరారు కానీ.. అక్కడ విభేదాలు సృష్టించేందుకు వెళ్లారని అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి వారి విషయాన్ని ముందే గ్రహించారు సీఎం చంద్రబాబు. వారిని వలస పక్షులతో పోల్చారు. అందుకే ఇప్పుడు టిడిపి ఇన్చార్జిల నియామకంలో.. ఆ రెండు పార్టీల అభిప్రాయాలను తీసుకొనున్నారు. మూడు పార్టీల శ్రేణుల మధ్య సమన్వయ సాధనకు.. ఎటువంటి లోపాలు తలెత్తకుండా ద్వితీయ శ్రేణి నాయకులకు నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వాలని చంద్రబాబు చూస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జగన్ పర్యటనలు ఎలా మారుతున్నాయి...

**తిరుపతి - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత జగన్ పర్యటనలు అంటేనే టెన్షన్ మధ్య సాగుతున్నాయి. నిజానికి ఇది కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు స్థానిక పోలీసులకు కూడా తలనొప్పిగా తయారైంది. జగన్ జిల్లాలకు వస్తున్నారంటే పోలీసులతో పాటు సిబ్బంది కూడా భయపడిపోతున్నారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎన్ని హెచ్చరికలుచేసినా బేఖాతరు చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ వివిధ వర్గాల సమస్యలపై జిల్లాలను పర్యటిస్తున్నారు. అయితే ఆయన పర్యటనలు వరసగా వివాదం అవుతుండటం, ఏదో ఒక అనుకోని ఘటనలు జరుగుతుండటంతో శాంతిభద్రతల సమస్యగా మారుతుంది. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జరగాల్సిన నష్టం రిగిపోతూనే ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీకి సమస్యలను అడ్రస్ చేయడానికి ఆసక్తి చూపుతారు. అధికారంలో ఉన్నప్పుడు కనపడని సమస్యలు అధికారం లేనప్పుడు కనిపిస్తాయి. అది చంద్రబాబుకు అయినా.. జగన్ కు అయినా అంతే. కేవలం ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే కాదు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. ఏ మాత్రం అవకాశం ఉన్నా వెంటనే ప్రతిపక్ష నేతలు అక్కడకు వెళ్లి పరామర్శించి తాము ఉన్నామని ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తారు. నిజానికి ప్రతిపక్ష నేతలు ఎవరు ఎన్ని పర్యటనలు చేసినా ఆ సమస్యలు పరిష్కారం కావు. అధికారంలో ఉన్న పార్టీ మాత్రమే సమస్యలను పరిష్కరించేందుకు అవకాశముంటుంది. అది గిట్టుబాటు ధరలైనా? మరొకటైనా పవర్ లో ఉన్న పార్టీ స్పందిస్తేనే అనుకూలమైన నిర్ణయం వస్తుంది అది తెలిసినా ప్రజలు మాత్రం ప్రతిపక్ష నేతలు తమ వద్దకు వస్తే బాహ్య ప్రపంచానికి తెలుస్తుందని నమ్ముతారు. ఉదాహరణకు మిర్చి రైతుల సమస్యలపై గిట్టుబాటు ధరలు రావడం లేదని జగన్ గుంటూరు పర్యటనలు చేశారు. తర్వాత కొంత అధికార పార్టీలో హడావిడి కనిపించింది. ఆ సమస్య మళ్లీ ఇక కనిపించలేదు. ఇక పొగాకు కు మద్దతు ధర కల్పించాలంటూ రైతులు ఇబ్బందులు పడుతుండటంతో జగన్ పొదిల పర్యటన చేపట్టారు. తర్వాత కేంద్ర మంత్రి వచ్చి పొగాకు బోర్డును సందర్శించి వెళ్లారు. తర్వాత ఆ సమస్య పరిష్కారం అయిందో లేదో తెలియదు. ఇప్పుడు జగన్ బంగారు పాళ్యం పర్యటనలోనూ మామిడి రైతులు పరామర్శించారు. అయితే ఇది కూడా నాలుగు రోజుల తర్వాత అంతే. కానీ జగన్ పర్యటనల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కార్యకర్తలు భారీగా తరలి వస్తుండటంతో పోలీసులు అదుపు చేయలేక పోతున్నారు. పొదిలి పర్యటనలో టీడీపీ కార్యకర్తలకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ జరిగింది. జగన్ పల్నాడు జిల్లా



రెంటపాళ్ల పర్యటనలో ఒక వ్యక్తి మరణించడం కలకలం రేపింది. దీనిపై జగన్ తో పాటు పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈరోజు తాజాగా బంగారుపాళ్యం ఘటనలో కార్యకర్తలు పోలీసుల లాఠీఛార్జిలో తీవ్రంగా గాయపడ్డారు. జగన్ పర్యటనలు కొన్ని రోజుల ముందు హైటెన్షన్ మధ్య కొనసాగుతుండటంతో పోలీసులకు తలనొప్పిగా తయారయ్యాయి. అలాగని పర్యటనలకు అడ్డు చెప్పలేరు. నిబంధనలు పెట్టినా అమలు కావు. మరి మరో నాలుగేళ్లు ఇలాగే కొనసాగాల్సిందేనా? అన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

**జగన్ ది విధ్వంస యాత్రే : అచ్చెన్నాయుడు**

జగన్ పర్యటన సినిమాసెట్టింగ్ మాదిరిగాఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ లేని సమస్యను సృష్టించేందుకు జగన్ పర్యటనలు చేస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లాల్లో 99 శాతం మామిడి కొనుగోళ్లు పూర్తయ్యాయన్న అచ్చెన్నాయుడు పరిష్కారం కోసం కాదు..ప్రచారం కోసమే వాళ్ల ఆరాటమని, జనసమీకరణ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. డబ్బులు ఖర్చు పెట్టి మరీ జనాలను తీసుకొస్తున్నారని అన్నారు. ఆరు కిలోమీటర్ల దూరంలో హెలిప్యాడ్‌కు అనుమతి కావాలన్నారని, వంద మీటర్ల దూరంలో అనుమతి ఇస్తామంటే ఒప్పుకోరని తెలిపారు. హెలిప్యాడ్ దగ్గరకు వచ్చి విధ్వంసం చేస్తున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. క్రిమినల్ ఆలోచనలు, సెట్టింగ్‌లతోనే ఇలాంటి కార్యక్రమాలు చేశారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వైసీపీ నేతకు చెందిన పొలంలో పండిన మామిడి పండ్లను తెచ్చి రోడ్లపైకి పోసి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు నటించారని, జగన్ విపక్షంలో ఉండి కూడా విధ్వంసాన్ని సృష్టించేలా ప్రవర్తిస్తున్నారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

**ప్రతి చోట బలప్రదర్శనే**

సత్యసాయి, పల్నాడు జిల్లాల్లో ఎదురైన పరిణామాలు దృష్ట్యా చిత్తూరు పోలీసులు ముందుగానే ఆంక్షలు విధించారు. పల్నాడు జిల్లాలో జగన్ పర్యటనలో అపశృతులు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. సింగయ్య అనే వృద్ధుడు జగన్మోహన్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు కింద పడి చనిపోయాడు. మరో ఇద్దరూ జగన్మోహన్ రెడ్డి కాన్వాయ్ మూలంగా చనిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే ఇప్పుడు మామిడి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ జగన్మోహన్ రెడ్డి నేరుగా వారిని పరామర్శించేందుకు బయలుదేరారు. అయితే సీజన్ దాటిన తర్వాత పరామర్శ ఏమిటన్న విమర్శ వినిపిస్తోంది. కేవలం ఇది రాజకీయ కోణంలో చేస్తున్న పర్యటనగా మిగతా రాజకీయ పక్షాలు అభివర్ణిస్తున్నాయి. కానీ జగన్ ఇవేవీ పట్టించుకోలేదు. మరోవైపు నిన్ననే చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జగన్ పర్యటనలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అలా నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. కానీ కనీస స్థాయిలో కూడా వైసిపి నేతలు దీనిని పట్టించుకోలేదు. భారీగా జన సమీకరణ చేశారు. అడుగడుగునా ఆంక్షలు అధిగమించారు. బంగారుపాళ్యంలోని మార్కెట్ యార్డులో 500 మందికి మించి ఉండకూడదని పోలీసులు తేల్చి చెప్పారు. కానీ వేలాది మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుగానే మార్కెట్ యార్డులోకి చొచ్చుకొచ్చాయి. మరోవైపు భారీగా జన సమీకరణ నడుమ కాన్వాయ్ నడుస్తుండగా.. విజయానంద రెడ్డి అనే వైసీపీ నేత కింద పడిపోయారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించాల్సిన పరిస్థితి ఎదురయింది. అయితే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆ ఒక్క నియోజకవర్గమేనా.?

**విజయవాడ - సూర్య వాస్తవం**

కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయింది. గత ఎన్నికల్లో జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించింది. అయితే జనసేన అధినేతగా పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి వచ్చారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమిలోని ఇతర పార్టీల అభ్యర్థుల తరుపున కూడా ప్రచారం చేసినప్పటికీ తన పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎన్నికలకు ముందు పర్యటించిన జగన్ కనీసం గెలిచి ఏడాది గడుస్తున్నప్పటికీ ఆ నియోజకవర్గాలకు వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 21 శాసనసభ నియోజకవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలు ఉంటే కనీసం అక్కడ పర్యటించేందుకు కూడా పవన్ కళ్యాణ్ కు తీరికలేదా? అని ప్రశ్నిస్తున్నారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని, అక్కడ టీడీపీ ఇన్ ఛార్జుల మాటే చెల్లుబాటు అవుతుందని, తమను అధికారంలో ఉన్న వారిగా అధికారులు కూడా పరిగణించడం లేదని ఎమ్మెల్యేలు మొత్తుకుంటున్నా అటు వైపు జనసేనాని చూడకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. కనీసం హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు సాధించిన తన విజయానికి కారణమైన నియోజకవర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు కూడా పవన్ కళ్యాణ్ సమయాన్ని వెచ్చించకపోవడంపై నేతలు నిరాశ చెందుతున్నారు. స్థానిక కార్యకర్తలు కూడా పవన్ కళ్యాణ్ ను ఎప్పుడు నియోజకవర్గానికి తీసుకువస్తారని ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ నియోజకవర్గాల్లో పేరుకుపోయిన సమస్యలను చెప్పుకుందామంటే పవన్ కళ్యాణ్ కనీసం ఇటు వైపు చూడకపోవడమేంటన్నది ఎమ్మెల్యేలు కూడా నిరాశ చెందుతున్నారు. పవన్ కళ్యాణ్ తమ నియోజకవర్గానికి ఒకసారి వచ్చి ప్రజలతో కలిసి బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా వివరిస్తే బాగుంటుందని చెబుతున్నారు. ప్రజల్లో పవన్ కళ్యాణ్ నోటి ద్వారా వచ్చే మాటలకు ఎక్కువ విశ్వసనీయత ఉంటుందని, తాము మరోసారి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నా, మరొకసారి ఈ నియోజకవర్గం నుంచి గెలవాలన్నా పవన్ పర్యటనలను నియోజకవర్గాల్లో చేయాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. షూటింగ్ లవల్లనేనంటూ అసలు తాను ప్రాతినిధ్యం వహించిన పిఠాపురం నియోజకవర్గానికే పవన్ కళ్యాణ్ చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారని, ఇక 20 నియోజకవర్గాల్లో ఎలా పర్యటిస్తారని కొందరు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. అయితే పవన్ కళ్యాణ్ జిల్లాల పర్యటన ఆయన గతంలో అంగీకరించిన సినిమాల షూటింగ్ ల కారణంగా వాయిదా



పడుతూ వస్తుందని, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించడానికి ప్లాన్ చే?స్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయినాసరే ఏడాదయినా ఓటేసిన తమను పట్టించుకోలేదన్న ఆవేదనలో ప్రజలు ఉన్నారని, పవన్ కళ్యాణ్ కనీసం వారానికి ఒక నియోజకవర్గంలోనయినా పర్యటించాలని జనసేన ఎమ్మెల్యేలు కోరుతున్నారు. మరి పవన్ పర్యటనలు ఇకమీదైనా ఉంటాయా? లేదా? అన్నదితేలాల్సి ఉంది.

# ఏకగ్రీవంగా లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా. కె. రఘువీర్ , ప్రధాన కార్యదర్శిగా పట్రా శ్రీనివాసులు. కోశాధికారిగా డి. షేక్షావలి**



**పామిడి- సూర్య వాస్తవం, జులై 10:** పామిడి లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పామిడి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు తెలిపారు. లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షి రెడ్డి సమక్షంలో. కమిటీ ఏకగ్రీవమైంది. పామిడి లైన్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా. కె. రఘువీర్ ప్రధాన కార్యదర్శిగా పట్రా శ్రీనివాసులు. కోశాధికారిగా డి. షేక్షావలి. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లైన్స్ క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షి రెడ్డి మాట్లాడుతూ ...లయన్స్ క్లబ్ లయనిజం అనేది ప్రపంచంలో 200 పైగా దేశాలలో పనిచేస్తున్న అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ లైన్స్ క్లబ్ అన్నారు. ప్రతి మనిషి తోటి వారికి సాయం అందించాలన్నారు. మనకు సాయం చేసే వారికే కాకుండా అపకారం చేసే వారికి కూడా ఉపకారం చేయగలడం దైవత్వం అన్నారు. సేవా దృక్పథాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అతి స్వల్ప కాలంలోనే 9000. మందికి ఉచిత కంటి ఆపరేషన్లు బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే చేయించిన ఘనత పామిడి లయన్స్ క్లబ్ వారికి దక్కినది. అదేవిధంగా అనేక సేవా కార్యక్రమాలు పామిడి లైన్స్ క్లబ్ సభ్యులు నిర్వహించినందుకు పామిడి లైన్స్ క్లబ్ వారిని అభినందిస్తున్నానన్నారు. పామిడి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా పేదరికం పాల ద్రోలాటమే పామిడి లైన్స్ క్లబ్ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం సేవా కార్యక్రమాలే లక్ష్యంగా లైన్స్ క్లబ్ కృషి చేస్తుందన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా ఆరోగ్యం పరంగా సేవా కార్యక్రమాలను చేపడుతూ తోటి వారిని సేవా దృక్పథం వైపుగా నడిపిస్తున్నామంటూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని భాగస్వాముల కావాలని కోరారు. ఆపదలో ఉన్నవారికి చేయూతనందిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్న ఉద్దేశంతో లైన్స్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు వెల్లడించారు.

# ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట



**కదిరి -సూర్యవాస్తవం,జూలై 10:**

మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పలు కార్యక్రమాలకు హాజరై విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల కు ఆత్మీయంగా పలకరిస్తూ వారి పిల్లల పట్ల బాధ్యతాయుతమైన ప్రోగ్రెస్‌పై ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు అడిగి తెలుసు కున్నారు గురువారం కదిరి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల లలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వ హిస్తున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు కదిరి శాసనస˘భ్యులుకు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు ఆత్మీయంగా పలకరిస్తూ విద్యార్థుల పట్ల వారికున్న బాధ్యతలను గుర్తు చేశారు అనంతరం పిల్లల విద్యాభ్యాసంలో ఉపాధ్యాయుల బృందం భాగస్వామ్యం కావాలని సూచించారు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులకే కాకుండా వారి యొక్క తల్లిదండ్రుల బాధ్యత ఎంతైనా ఉందని తెలియజేశారు.

అనంతరం ఉత్తమ విద్యార్థినీ,విద్యార్థుల కు బహుమతులు ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాద్‌నిషా,ఆర్డిఓ శర్మ, ప్రధాన ఉపాధ్యాయులు వెంకటాచలం, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## పాఠశాల అభివృద్ధిలో
# తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

**- సిద్ధవటం తహశీల్దార్ ఆకుల తిరుమలరావు**



**సిద్ధవటం - సూర్యవాస్తవం, జూలై 10 :** పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని సిద్ధవటం తహసీల్దార్ ఆకుల తిరుమలరావు పిలుపునిచ్చారు. మండలకేంద్రమైన సిద్ధవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మెగా పేరెంటి టీచర్స్ మీటింగ్ 2.0 సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని వసతులను కల్పించేందుకు విద్యార్థులు హాజరు పెంచేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు తోడ్పాటును అందించాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అధికారి సిద్ధవటం మండల అభివృద్ధి అధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ మెగా పిటీఎం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం వల్ల విద్యార్థుల్లో ఆశించిన ఫలితాలను రాబట్ట వచ్చునన్నారు. ఎస్ఎంసి సభ్యుల సహకారంతో పాఠశాల అభివృద్ధిలో మౌళిక వసతులు కల్పించవచ్చున్నారు. సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారి పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు తీసుకున్న మొక్కలని విధిగా ఇంటిలో నాటి సంరక్షి ంచాలన్నారు. ప్రతి విద్యార్థి గ్రీన్ పాస్‌పోర్ట్ నిర్వహణను సమర్థ వంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు సహకరి ంచాల న్నారు. అనంతరం సభాధ్యక్షులు పాఠశాల ప్రధానో పాధ్యా యులు గాడి శ్రీహరి మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వ హించే మెగా పిటిఎం ద్వారా గ్రామీణ విద్యార్థుల్లో చైతన్యంతో పాటుగా సమైక్యత పెంపొందుతుందన్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గులు పోటీలు, తండ్రులకు టగ్ అఫ్ వార్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన జాస్మిన్, ఆయేషా ఖానమ్ లకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ నాగార్జున, లైబ్రేరియన్ లక్ష్మీ నారాయణమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లోకేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# కదిరి నారాయణ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే

**కదిరి- సూర్య వాస్తవం, జూలై 10 :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న** మెగా పేరెంట్స్ డేలో భాగంగా గురువారం కదిరి పట్టణంలోని నారాయణ పాఠశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా నారాయణ పాఠశాలల ఏజీఎం రమేష్ బాబు ఆధ్వర్యంలో, ప్రధానోపాధ్యాయులు పటాన్ సర్ఫరాజ్ ఖాన్ విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు, ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ శిరీష కు సాదరంగా స్వాగతం





పలికారు అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు, నైతిక విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు మమేకం కావడం బాధ్యత గా భావించాలని పేర్కొన్నారు, ఉత్తమ విద్యను అభ్యసించడమే కాకుండా అనేక రంగాలలో పిల్లలకు తర్ఫీదు ఇవ్వడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించే విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాలుపంచుకోవాలని సూచించారు, తరగతుల విద్యాభ్యాసం అనంతరం పిల్లలు తల్లిదండ్రుల దగ్గర ఉన్న సమయంలో వారికి సరైన మార్గదర్శకాలు పెంపొందించేలా విద్యార్థులు తల్లిదండ్రులు వారికి సహకరించాలని తెలియజేశారు, పిల్లలకు ఎక్కువగా సెల్ఫోన్ ఇవ్వడం ద్వారా వారి కంటి చూపు క్షీణిస్తుందని తద్వారా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలియజేశారు, అనంతరం విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీ లలో భాగంగా ఎంపికైన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు, అనంతరం ఉత్తమ పేరెంట్స్ అయినా డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ శిరీషలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి వారికి ప్రధాన బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల ప్రోగ్రాం ఇంచార్జ్ రెడ్డి హరిత, అకాడమిక్ డిన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏవో జక్రియ, ఈ ఛాన్స్ వైస్ ప్రిన్సిపల్ నియామత్, ఈ కిడ్జ్ వైస్ ప్రిన్సిపల్ రాసినేని హరిత, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## చదువును మళ్ళీ కొనసాగించడానికి
# చక్కటి అవకాశం ఓపెన్ స్కూల్

**- రాష్ట్ర రవాణా ,యువజన క్రీడా శాఖ మండిపల్లి మంత్రి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 10:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా దూర విద్యా విధానంలో ప్రభుత్వం కల్పించిన పదవ తరగతి ఫెయిల్ అయిన వారు మళ్ళీ పదవ తరగతిలో చేరి ఉత్తీర్ణత పొందే అవకాశం,బడి మధ్యలో మానేసి 14 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరికి ఓపెన్ స్కూల్ ద్వారా పది పరీక్ష రాసే ఒక చక్కటి అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందని,అలాగే 10 ఉత్తీర్ణులైన వారికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కూడా అతి తక్కువ ఫీజులతో ఆగిపోయిన చదువులను ఓపెన్ స్కూల్ విధానంలో కొనసాగింపుటకు అవకాశం ఉందని,2025బి26 ప్రవేశాలకు సంబంధించిన సార్వత్రిక విద్యాపీఠం ప్రచార పోస్టర్లను కరపత్రాలను గురువారం రాష్ట్ర రవాణా ,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో అగ్ని ప్రమాదం : లారీ దగ్ధం



**మదనపల్లె -సూర్య వాస్తవం, జూలై10:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె బసినికొండ బైపాస్ రోడ్డులో గురువారం వేకువ జామున, అగ్ని ప్రమాదం సంభవించి లారీ దగ్ధమైంది. అగ్ని ప్రమాద ఘటనపై మదనపల్లె అగ్ని మాపక అధికారి శివప్ప తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె టమోటా మార్కెట్ లోని ఓ మండీ నిర్వాహకుడు తన లారీని బసినికొండ బైపాస్ రోడ్డు, వై జంక్షన్‌లో రాత్రి లారీ నిలబెట్టాడన్నారు. ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి తెల్లవారు జామున తగలబడుతు, మంటలు చెలరేగి కాలుతున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేసేలోపే 80% లారీ కాలిపోయి, సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని చెప్పారు.

# ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించిన మహిళలు



**సిద్ధవటం - సూర్యవాస్తవం, జూలై 10:** కడప - చెన్నై జాతీయ రహదారిలోని భాకరాపేట సమీపంలో వెలసినశ్రీ ఎల్లమ్మ అమ్మవారికి గురువారం మహి ళలు, రాష్ట్ర వైసీపీ మహిళా కార్యదర్శి యేకుల రాజేశ్వరి రెడ్డి బోనాలను సమర్పించారు. మొదట భాకరాపేట గ్రామంలోని గ్రామదేవత గంగమ్మ అమ్మ వారికి మహిళలు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కాలినడకన మహిళలు నడు చు కు ం టూ ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పి ంచారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లా డుతూ ..పెద్దల సాంప్రదాయం ప్రకారం ప్రతి ఏటా ఎల్లమ్మ అమ్మవారికి మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాల సమర్పించడం అనవయితీగా వస్తుందన్నారు. సకాలంలో వర్షాలు పడి ప్రతి రైతు పొలాల్లో పంటలు పండి రైతుల ఇంట సిరిసంపదలతో భోగ భాగ్యాలతో విరసిల్లాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై10:** రాయచోటి కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవిన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది సమస్యలపై వివిధ అంశాలు చర్చించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రాయచోటి తాహాసిల్దార్, నరసింహాకుమార్, జీవన్ చంద్ర శేఖర్, అన్నమయ్య జిల్లాలోని వివిధ మండలాల తాసిల్దార్లు, కడప జిల్లా తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## అందరికీ సాయిబాబా ఆశీస్సులు ఉండాలి

### - ఘనంగా సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు
### - 11వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 10:** అందరికీ సాయిబాబా ఆశీస్సులు ఉండాలని 11వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి అన్నారు. మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ బెటాలియన్ ఎదురుగా వెలసిన శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి యేకుల రాజేశ్వరి రెడ్డి సాయిబాబా ను దర్శించుకున్నారు. గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఉదయం కాకడహారతి, సుప్రభాతం, పంచా మృతా భిషేకం, నవగ్రహ పూజ, హెూమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి వచ్చిన భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. సాయంత్రం గ్రామోత్సవము, సంధ్యాహారతి, తదుపరి పల్లకి సేవ, సేజ్ హారతి, ఆర్కెస్ట్రా వారిచే సాంస్కృతిక కార్య క్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఐలు, యల్లారెడ్డి, నిర్వాహకులు ఆవుల రెడ్డి, సురేంద్ర, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయుడు కాలనీలో మెగా పీటీఎం

### - టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి వతన్ నిసార్



**రాయచోటి-సూర్య వాస్తవం, జులై10:** మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 2.0ని పాఠశాల-తల్లిదండ్రుల సంబంధాన్ని బలోపేతం చేయడానికి ఒక ప్రత్యేకమైన చొరవగా రాష్ట్ర ప్రభుత్వం అభివర్ణించిందని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి వతన్ నిసార్ అన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేటీఎం 2.0 కార్యక్రమం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని రాయుడు కాలనీ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రుల- ఉపాధ్యాయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 60 వేలకు పైగా విద్యా సంస్థలలో రికార్డు స్థాయిలో 2, కోట్లమందికి పైగా పాల్గొనే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ రాష్ట్రంలోనే ఒక అద్భుతం అన్నారు.పాఠశాల లపిల్లలు తమ భవిష్యత్తుని బంగారు భవిష్యత్తు గా మార్చుకోవాలని ఆయన చెప్పారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల పిల్లలు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు, షౌకత్, తెలుగుదేశం పార్టీ నాయకుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

### - విద్యాశాఖ మంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే



**చెన్నూరు-సూర్య వాస్తవం, జులై 10:** వైయస్సార్ఆర్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని దానికి సంబంధించిన సిఓఏ( కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్) అనుమతులు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పుట్టపర్తి పర్యటనలో ఉన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి విన్నవించడం జరిగింది. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సానుకూలంగా ఉందని విద్యార్థులకు మనోధైర్యం కల్పించడమే కాకుండా వారిని అన్ని విధాల ఆదుకోవడం జరుగుతుందని ఆయన ఖాళీ ఇచ్చినట్లు తెలిసింది. వైయస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తమ పట్ల ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని తమ తమ సమస్యలను, విద్యార్థుల బాధలను అర్థం చేసుకుని పుట్టపర్తి పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ కు విద్యార్థుల సమస్యలను వివరించడం పట్ల ఎమ్మెల్యే పుత్తాకృష్ణ చైతన్య రెడ్డికి ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ పశ్చిమ ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాబాను దర్శించుకున్న మున్సిపల్ ఛైర్మన్




**కదిరి-సూర్య వాస్తవం, జూలై 10:** గురు పౌర్ణిమ సందర్భంగా గురువారం కదిరి పట్టణంలోని వాణి వీధిలోని సాయిబాబా ఆలయం లో కదిరి మునిసిపల్ ఛైర్మన్ దిల్షాద్ నిషా బహవుద్దిన్ దర్శించుకున్నారు కులమతాలకు అతీతంగా, సాంప్రదాయ బద్ధంగా బాబాను దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతంగా భావించి భక్తి భావంతో దర్శించు కున్నామని తెలియ జేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార ్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో కదిరి మండల తహసిల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో పోలప్ప, మున్సిపల్ కౌన్సిలర్లు కిన్నర కళ్యాణ్ కుమార్ , షానవాజ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో

# తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

### - విద్యార్థుల తల్లితండ్రులకు ప్రత్యేక ఆహ్వానం
### - రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై10:** రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులో దాగి వున్న ప్రతిభను వెలికి తీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం కె.రామా పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తలి ్లదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో (మెగా పిటిఎం 2.0) మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి చిన్నారుల ప్రార్ధనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కె.రామా పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి గజమాల వేసి, కోలాటంతో తన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో మధుర స్మృతిలా నిలిచిపోయేలా నిర్వహించి పిల్లలు అభివృద్ధి చెందే అంశాలను గుర్తించి ఆ మేరకు అన్ని రంగాలలో శిక్షణ ఇచ్చి తద్వారా పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హెచ్ ఆర్ డి మంత్రివర్యులు నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో గత ఏడాది కాలంలో విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను ప్రక్షాళన చేయడంతో పాటు అనేక మార్పులు తీసుకొచ్చి ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది తల్లిదండ్రులు - ఉపాధ్యా యుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సమావేశాలలో పిల్లలకు సంబంధించి తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల కలిసి పిల్లల అభివృద్ధి చెందడానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించుకోవడం జరుగుతోందన్నారు. ఇలాంటి కార్యక్ర మాలను గతంలో ప్రైవేటు పాఠశాలల్లో ఉండేదని ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఇది శుభ పరిణామన్నారు. అంతేకాకుండా వీటిని సక్రమంగా నిర్వహించుటకు తల్లిదండ్రులనే స్కూల్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసి అవినీతికి ఆస్కారం లేకుండా విజయవంతంగా చేపట్టడం జరుగుతున్నదన్నారు. ఇలా విద్యా వ్యవస్థలో సమూలన మార్పులు తీసుకురావడానికి ఈ కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పిటిఎం 2.0) కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల ప్రతిభను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాల ప్రగతితో పాటు, విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యం, ఆటలు, క్రీడలు లాంటి విన్యాసాలలో ప్రావీణ్యత, తోటి విద్యార్థులతో ప్రవర్తన, భావవ్యక్తీకరణ, పరస్పర సహకారం, నాయకత్వ లక్షణాలు తదితర విషయాలన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే తల్లిదండ్రులు పిల్లలకు ఏ విషయంలో ఏ ప్రతిభవంతు గుర్తించి దానిని ప్రోత్సహి ంచాలని తెలిపారు.



అలాగే పిల్లలు కూడా వారికి నచ్చిన విషయంలో బేసిక్స్ నుంచి సంపూర్ణంగా అర్థమయ్యే విధంగా చదువుకోవాలని, అలాగే ఫెయిల్యూర్స్ కు భయపడకుండా, మనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని పట్టుదలతో ఎంచుకున్న రంగాన్ని సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. అలాగే పాఠశాలల అభివృద్ధి, పిల్లలలో అభ్యాసనా సామర్థ్యం తదితర అంశాలను తల్లిదండ్రులతో చర్చించి వారి సూచనలను పరిగణలోకి తీసుకొని పిల్లల అభివృద్ధికి చర్యలు తీసు కోనున్నట్లు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల పైచిలుకు పిల్లలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ఒకేసారి నిర్వహించి విజవంతం చేయాలని ప్రభుత్వం సూచించిందని ఈ మేరకు కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఇఓ సుబ్రహ్మణ్యం, ఎంఈ ఓలు బాలాజీ నాయక్, శివారెడ్డి, సమగ్ర శిక్ష సిఎంఓ కరు ణాకర్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ సాలయ్య, ప్రాథమిక పాఠశాల చైర్మన్ శ్రీమతి మల్లమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# మెగా పీటీఎం 2.0లో ఎమ్మెల్యే దగ్గుపాటి

### - ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సిఫార్సులు చేయించుకునే రోజులు వస్తాయి
### - గత ఐదేళ్లలో నాశనమైన విద్యా వ్యవస్థను మంత్రి లోకేష్ గాడిలో పెట్టారు
### - సహపంక్తి భోజనాలు, విద్యార్థులతో ముచ్చట్లు, హామీలు, సెల్ఫీలతో సందడిగా గడిపిన ఎమ్మెల్యే

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 10:** ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు-ఉపాధ్యాయులు మధ్య మంచి సమాచారం సంబంధాలు ఉండాలని అందుకోసమే మెగా పీటీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం 2.0 కార్యక్రమం పండుగ వాతావరణం లో జరిగింది. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాల, శ్రీకృష్ణదేవరాయల మున్సిపల్ హై స్కూల్, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పీటీఎం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. అక్కడ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. అలాగే పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు గురించి ఆరా తీశారు. పిల్లల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించి వారి మార్కులను ఆరా తీశారు. కొంతమంది విద్యార్థులకు మార్కులు తక్కువగా ఉండటంపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. వచ్చే ఏడాదికి పిల్లలు మరింత మెరుగ్గా రాణించాలని సూచించారు. అలాగే విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి గ్రీన్ పాస్ పోర్టులను కూడా అందజేశారు. వాటి ఉద్దేశం గురించి విద్యార్థులకు అర్థమ య్యేలా చెప్పాలని ఎమ్మెల్యే సూచించారు. కొత్తరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. కెఎస్ఆర్ కళాశాలలో విద్యార్థినుల చేత తల్లుల పాదాలకు పుష్పాలు సమర్పించి పాదాభివందనం చేయించారు. శ్రీ కృష్ణదేవరాయ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ ను సొంత ఖర్చులతో నిర్మిస్తామని హామీతో పాటు జూనియర్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ హాస్టల్ కావాలని కోరగా కచ్చితంగా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కాంపౌండ్ వాల్ లేదని చెప్పగా.. ఇందుకోసం నిధులు



తెస్తామని చెప్పారు. ప్రతి పాఠశాలలో సైనింగ్ స్టార్ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మెగా పీటీఎం కార్యక్రమం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందన్నారు. గత ఐదేళ్లలో విద్యావ్యవస్థ నాశనమైందని దీనిని ఛాలెంజింగ్ గా తీసుకొని మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారన్నారు. ఏడాది కాలంలోనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. నేడు పాఠశాలల్లోనూ, విద్యా బోధనా విధానంలో కూడా మార్పులు వచ్చాయన్నారు. గతంలో విద్యార్థులు చదువుకునే పుస్తకం వద్ద నుంచి తినే పదార్థం వరకు అన్నింటి మీద జగన్ ఫోటోలు కనిపించేవన్నారు. పబ్లిసిటీ పిచ్చితో విద్యార్థులను ఇబ్బందులు పెట్టారన్నారు. కానీ మంత్రి నారా లోకేష్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు మీదుగా విద్యా కానుక కిట్లు అందజేసినట్లు తెలిపారు.

ఎక్కడా ఎవరి ఫోటోలు లేకుండా పుస్తకాలు ఇతర సామాగ్రి అందజేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం భోజనానికి సన్న బియ్యం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం నగరంలోని ఏడు ప్రాథమిక పాఠశాలలను అప్ గ్రేడ్ చేసినట్లు వివరించారు. తల్లికి వందనం పథకం పాఠశాల ప్రారంభమైన రోజే ఇవ్వడంపై ప్రతి తల్లి సంతోషంగా ఉన్నారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలకు ఉన్న అందరికీ ఈ డబ్బు అందిందన్న ఆనందం కనిపిస్తోందన్నారు. ఇది వారి పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం పరిస్థితులను చూస్తే రెండు మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు సిఫార్సులు చేయించుకునే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఈ కార్యక్రమాలలో అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణం, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, టిఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్ కుమార్, టిడిపి నాయకులు సాకే జయప్ప, కదిరప్ప, నెట్టెం బాలకృష్ణ, వడ్డే భవాని, రమాదేవి, కృష్ణం రఘు, చెరుకుతోట పవన్ కుమార్, ముస్తాక్ పాఠశాలల అధ్యాపకులు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- పి - 4 మోడల్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 10:** జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిని సారించి వ్యాధులను ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివిధ శాఖల కార్యదర్శిలతో స్వర్ణాంధ్ర పి4, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ సీజనల్ వ్యాధుల జాగ్రత్త చర్యలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లు సంబంధిత శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వారు ఆదేశాలు సూచనలు జారీ చేశారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా సంక్షేమ వసతి గృహాలలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. డెంగు డయోరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్త దినపత్రికల్లో వచ్చే వార్తలపై ఆయా శాఖల అధికారులు స్పందించి వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్నర్షిప్) మోడల్ సర్వే పై అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పేదరికంతో మగ్గుతున్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా భావిస్తూ వారికి చేయూతనిచ్చే విధంగా ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచడం జరుగు తున్నందున మార్గదర్శకాలకు అనుగుణంగా కుటు ంబాల ఎంపికను వీలైనంత త్వరగా గుర్తించి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు హిట్ అండ్ రన్ చట్టం ప్రాధాన్యత పై సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రహదారి భద్రత విధానమును పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా జవాబు దారి తనంతో బాధితులకు న్యాయం , బాధ్యతారహిత డ్రైవింగ్ ను నిరోధించడం వంటి అంశాలలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నియంతలా వ్యవహరిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

**- రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన ఎస్పీ ఉల్లంఘిస్తే కాపాడేది ఎవరు**
**- సిపిఎం జిల్లా కార్యదర్శి తీవ్ర ఆరోపణలు**



**మదనపల్లె –సూర్య వాస్తవం, జూలై 10:** రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన అన్నమయ్య జిల్లా ఎస్పీ రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా నియంతలా వ్యవహరిస్తున్నారు అని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లి మండలం వేంపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న బుద్ధుని కొండలో బుద్ధుని తల తీసి చేతిలో పెట్టిన సంఘటన పట్ల శాంతియుత నిరసన దీక్షలు చేస్తున్న బాస్ అధినేత పిటిఎం శివప్రసాద్ అతని అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా బెదిరింపు ద్వారా తెలిపారు అంతేకాకుండా జూలై 9వ దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అన్నమయ్య జిల్లాలో తీవ్ర నిర్బంధం ప్రయోగించి సమ్మెను అనుచివేయాలని ఎస్పీ ప్రయత్నం చేశారని ఆరోపించారు ఉగ్రవాదుల చూసినట్లుగా ప్రజలను ప్రజాసంఘాలను పట్ల వ్యవహరించడం అత్యంత హేయమైన చర్యని అభిప్రాయపడ్డారు సాధారణంగా ప్రజా సమస్యల మీద తమ గొంతును వినిపించడానికి రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛను నిరసన తెలియజేసే హక్కును కల్పించిందని ఆ హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు భారత రాజ్యాంగం కల్పించినటువంటి భారత రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన జిల్లాస్థాయి ఉన్నత అధికారి ఈ విధమైన రాజ్యాంగ వల్ల హక్కుల ఉల్లంఘనకు పాల్పడతా ఉంటే కింది స్థాయిలో ఏవిధంగా ఉంటుందని ప్రశ్నించారు నిజంగా శాంతిభద్రతలు కాపాడాలి అనే లక్ష్యం అన్నమయ్య జిల్లా ఎస్పీకి ఉంటే భూ కబ్జాల పట్ల ఇసుక మాఫియా పట్ల గంజాయి మూకల పట్ల కాల్మని వేధింపులకు పాల్పడు తున్నటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని వారి కదలకల పట్ల నిఘా ఉంచి బడుగు బలహీన వర్గాలకు పేద ప్రజలకి అండగా ఉండాలని హితవు పలికారు ప్రజలకు రక్షణ కల్పించాల్సిన రక్షక భటులు కిందిస్థాయిలో భూ కబ్జాదారులకు ఇసుక మాఫియాకు పాల్పడుతున్న వారికి కాల్ మనీ వేధింపులకు పాల్పడుతున్న వారికే అండగా ఉంటూ బాధితులకు న్యాయం చేకూర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నారని దీనికి అన్నమయ్య జిల్లా ఎస్పీ ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న అధికారి రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి ప్రజల పైన ప్రజాస్వామ్యక వాదుల పైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ రాజ్యాంగ హక్కులను హరించి వేసే విధంగా వ్యవహరిస్తున్న వారిపై వారికి ఆ పదవిలో కొనసాగే అర్హత ఏమాత్రం లేదని అన్నారు అన్నమయ్య జిల్లా ఎస్పీ వైఖరి మార్చుకొని పక్షంలో అన్ని పార్టీలను ప్రజాసంఘాలను ప్రజాస్వామిక వాదులను ఐక్యం చేసి జిల్లా స్థాయి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి నాగరాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపే ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**




**తిరుపతి – –సూర్య వాస్తవం, జూలై 10:** విద్యార్థుల్లో ప్రతిభ, నైతిక విలువల పెంపుకు మెగా టీచర్ ప్యారెంట్ 2.0 ఎంతో ఉపయోగపడుతుందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తల్లికి వందనం ఒక్క పథకానికే పదివేల కోట్లు కేటాయించడం విద్యాప్రమాణాల మెరుగుదలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఆయన చెప్పారు. స్థానిక ఎంజిఎం హైస్కూల్ లో గురువారం ఉదయం మెగా పేరంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0 జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడంతో పాటు విద్యార్థుల తల్లులు వేసిన రంగవల్లులను ఆయన పరిశీలించారు. థగ్ ఆఫ్ వార్ లో తల్లితండ్రులతో కలిసి ఆయన పాల్గొన్నారు. స్కూల్ ఆవరణలో మొక్కలను ఆయన నాటారు. రాష్ట్రంలో విద్యారంగ ప్రమాణాల పెంపుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లితండ్రులు విద్యార్థుల పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో మెరుగైన విద్యను అందించేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్స్ స్కూల్స్ తెరిచేనాటికే అందించిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కిందని ఆయన చెప్పారు. కిట్స్ పై ఎవరి బొమ్మలు ముద్రించ లేదని ఆయన గుర్తు చేశారు. అలాగే పేదరికం కారణంగా విద్యకు ఏ ఒక్కరూ దూరం కాకుడదని తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి 13వేల రూపాయలు వారి తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని ఆయన తెలిపారు. పది వేల కోట్లు ఒక్క తల్లికి వందనం పథకానికే ప్రభుత్వం ఖర్చు చేస్తోందని ఆయన చెప్పారు. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం అందింస్తోందని ఆయన చెప్పారు. కాగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని గత ప్రభుత్వం నిలిపివేస్తే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థి తన తల్లితండ్రులకు మొక్కలను బహుమతిగా ఇచ్చి నాటే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని ఆయన చెప్పారు. పిల్లను ఎలా అయితే పెంచుతారో మొక్కలను అదేవిధంగా పెంచాలని తల్లితండ్రులను ఆయన కోరారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకుని తల్లితండ్రులకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బాలాజీ, ఎంజిఎం హైస్కూల్ ప్రిన్సిపల్ పరంధామ నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, బిజెపి నాయకులు వరప్రసాద్, వేదవతీ రాయల్ తదితరలు పాల్గొన్నారు.









## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సీఎం చంద్రబాబు, నారా లోకేష్




**శ్రీ సత్య సాయి బ్యూరో –సూర్య వాస్తవం ,జూలై 10:** శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గురువారం మధ్యాహ్న భోజనం చేశారు. ముందుగా విద్యార్థిని విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కాసేపు సరదాగా ముచ్చటించారు.

# రైతులకు, యువతకు ఉపయోగపడేలా పరిశ్రమలు ఏర్పాటు చేయండి

**- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి**
**- పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి దగ్గుపాటిని పరిచయం చేసిన మంత్రి నారా లోకేష్**
**- అనంతపురం యువతకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**
**- మంత్రి నారా లోకేష్ కు వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే దగ్గుపాటి**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 10:** అనంతపురం జిల్లాలో రైతులకు, యువతకు ఉపయోగపడే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్రమంత్రి పుట్టపర్తికి వచ్చారు. అదే సమయంలో మెగా పీటీఎం కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ కొత్తచెరువుకు వచ్చారు. ఈ ఇద్దరు మంత్రులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పుట్టపర్తి విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యే దగ్గుపాటిని ప్రత్యేకంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన అనంతపురం నియోజకవర్గ పరిధిలో ఎక్కువమంది నిరుద్యోగ యువత ఉన్నారని వారికి ఉద్యోగాలు కల్పించేలా వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎక్కువగా పండ్ల తోటలు, వేరుశనగ, మిర్చి, టమోటా వంటి పంటలు సాగవుతున్నాయని వీటికి అనుబంధంగా ఉండే పరిశ్రమలు ఏవైనా ఏర్పాటు చేస్తే ఇటు రైతులకు అటు యువతకు ఉపయోగపడతాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అన్ని అంశాలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇద్దరు మంత్రులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వీడ్కోలు పలికారు.






## కిరణ్ అబ్బవరం సినిమా టైటిల్ విడుదల

ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినిమా ఇండస్ట్రీలో పేరు తెచ్చుకోవాలని ఆశపడే ఔత్సాహిక నటీనటుల, సాంకేతిక నిపుణులకు అండగా నిలబడుతూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజేశ్వర్ రెడ్డి వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద శ్రీ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. సాయి తేజ్ కిరణ్ అబ్బవరం గత సినిమాల్లో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేశాడు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి. మునిరాజు దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. వి.మునిరాజు కిరణ్ అబ్బవరం మూవీస్‌కు ఆన్ లైన్ ఎడిటింగ్ చేసేవారు. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ఆసక్తిని కలిగిస్తున్నాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరలో "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా షూటింగ్ ప్రారంభించనున్నారు.నటీనటులు - సాయి తేజ్, వేద శ్రీ, ప్రదీప్ కొట్టె, తేజ విహాన్, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ వడ్డాది, మాధవి ప్రసాద్, టీవీ రామన్, చిట్టిబాబు, లతీష్ కీలపట్టు, రాజశ్రీ మడక, కేఎల్ మదన్, అన్నుమన్, రఘురామవాసి, బాలరాజు పులుసు, సాయికృష్ణ సంగపు, కరిశ్మ నెల్లూరు, ఆర్. వశిష్ఠ,టెక్నికల్ టీమ్: కాస్ట్యూమ్ డిజైనర్ విశాల్య,ఆర్ట్ డైరెక్టర్ సుధీర్ మాచర్ల,బిజినెస్ హెడ్ అండ్ మార్కెటింగ్ చౌహాన్,క్రియేటివ్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కేఎల్ మదన్,డీవోపీ అక్షయ్ రామ్ పొదిశెట్టి,సీఈవో రహస్య గోరక్,పీఆర్ఓజీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్)కో ప్రొడ్యూసర్ తేజేశ్వర్ రెడ్డి వేల్పుచర్ల,ప్రొడ్యూసర్ కిరణ్ అబ్బవరం,రచన, దర్శకత్వం వి. మునిరాజు

## అక్టోబరు 31న 'బాహుబలి - ది ఎపిక్'

ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'బాహుబలి' మూవీ రెండు భాగాలుగా విడుదలై, ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబట్టిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం విడుదలై జులై 10 (గురువారాని)కి పదేళు పూర్తయ్యింది.

ఈ సందర్భంగా దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. 'బాహుబలి.. ఎన్నో ప్రయాణాలకు నాంది. మరెన్నో మధుర జ్ఞాపకాలు. ఎంతో మందికి స్ఫూర్తి' అని పేర్కొన్నారు. అలాగే మరో విషయం గురించి కూడా రాశారు. 'బాహుబలి'.. సినిమా విడుదలై పదేళ్లు పూర్తయింది. రెండు భాగాలుగా అలరించిన బాహుబలి ఇప్పుడు ఒకే పార్ట్‌గా మీ ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ఇది రిలీజ్ కానుంది.

ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది' అని పోస్ట్ పెట్టారు.

తాజా పోస్టు ప్రకారం ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానుంది. ఈ స్పెషల్ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్రబృందం 'బాహుబలి- ది ఎపిక్' అనే కొత్త టైటిల్‌తో ఈ చిత్రాన్నికి సంబంధించి పోస్టర్‌ని కూడా విడుదల చేశారు.



## ధనుష్ కొత్త సినిమా ప్రారంభం




తమిళ కథానాయకుడు ధనుష్ మరో కొత్త సినిమాలో నటిస్తున్నారు. ఆయన నటించిన 'కుబేర' సినిమా ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. తన కెరీర్‌లో 54వ (డి-54) సినిమాగా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఇక దీనికి దర్శకుడు విగ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. వేల్స్ ఫిల్మ్స్ ఎంటర్‌టైన్మెంట్, థింక్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. జివి ప్రకాష్ సంగీతం. తాజాగా ఈ చిత్రం నుంచి ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. 'కొన్నిసార్లు ప్రమాదకరంగా ఉండటమే బతకడానికి ఏకైక మార్గం. డి-54లో ధనుష్ ఈరోజు నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు' అని రాసుకొచ్చారు.

పోస్టర్‌ను గమనిస్తే ధనుష్ నిలబడి దిగాలుగా ఉండగా, పత్తి పంట కాలిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో ధనుష్ ఒక రైతుగా కనిపిస్తాడని అంటున్నారు.



## లార్డ్స్ టెస్ట్: ఆసక్తికరంగా తొలి రోజు ఆట




- లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్ట్ ప్రారంభం
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్
- తొలి రోజు మూడో సెషన్ సమయానికి 4 వికెట్లకు 225 పరుగులు
- 89 పరుగులతో ఆడుతున్న జో రూట్
- రెండు వికెట్లు పడగొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి
- బుమ్రా, జడేజాలకు చెరో వికెట్

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో తొలి రోజు ఆట ఆసక్తికరంగా సాగింది. గురువారం మూడో సెషన్ సమయానికి ఇంగ్లండ్ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసి నిలకడగా ఆడుతోంది. సీనియర్ బ్యాటర్ జో రూట్ (89 బ్యాటింగ్) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, భారత బౌలర్లు ఆరంభంలోనే దెబ్బతీశారు. నితీశ్ కుమార్ రెడ్డి తన అద్భుత బౌలింగ్‌తో ఓపెనర్లు బెన్ డకెట్ (23), జాక్ క్రాలీ (18) ఇద్దరినీ స్వల్ప వ్యవధిలో పెవిలియన్ పంపాడు. దీంతో ఇంగ్లండ్ 44 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఓలీ పోప్ (44), జో రూట్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. నిలకడగా ఆడుతున్న ఈ జోడీని రవీంద్ర జడేజా విడదీశాడు. పోప్‌ను ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. కాసేపటికే ప్రమాదకర బ్యాటర్ హ్యారీ బ్రూక్ (11)ను జస్ప్రీత్ బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ మళ్లీ కష్టాల్లో పడింది.

అయితే, జో రూట్ ఒకవైపు వికెట్లు పడుతున్నా సంయమనంతో ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అతనికి కెప్టెన్ బెన్ స్టోక్స్ (35 బ్యాటింగ్) తోడవడంతో ఇంగ్లండ్ తొలి రోజు పటిష్ట స్థితిలో నిలిచింది. భారత బౌలర్లలో నితీశ్ రెడ్డి రెండు వికెట్లు తీయగా, బుమ్రా, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. తొలి రోజు ఆటలో ఇరు జట్లు సమంగా పోరాడటంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.

## భారత క్రికెట్ దిగ్గజం సచిన్‌కు 'లార్డ్స్'లో అరుదైన గౌరవం

- లార్డ్స్ మ్యూజియంలో సచిన్ టెండూల్కర్ చిత్రపటం ఆవిష్కరణ
- ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్న సచిన్
- 1983 ప్రపంచకప్‌తోనే లార్డ్స్‌తో తొలి పరిచయమని వెల్లడి
- కపిల్ ట్రోఫీ అందుకోవడమే తన క్రికెట్ ప్రయాణానికి స్ఫూర్తి
- ఇదే మైదానంలో టెస్టు మ్యాచ్‌ను గంట మోగించి ప్రారంభించిన మాస్టర్




భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం లభించింది. క్రికెట్ మక్కాగా పేరుగాంచిన ప్రతిష్ఠాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ మ్యూజియంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిణామంపై సచిన్ స్పంది స్తూ, ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని, చాలా ఆనందంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన లార్డ్స్ మైదానంతో తనకున్న అనుబంధాన్ని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "1983లో కపిల్ దేవ్ సారథ్యంలోని భారత జట్టు ప్రపంచకప్ గెలిచినప్పుడే నాకు లార్డ్స్‌తో తొలి పరిచయం ఏర్పడింది. బాల్కనీలో కపిల్ ట్రోఫీని అందుకోవడం చూశాను. ఆ క్షణమే నా క్రికెట్ ప్రయాణానికి నాంది పలికింది" అని సచిన్ ఉద్వేగంగా చెప్పారు. తనను క్రికెటర్‌గా తీర్చిదిద్దిన స్ఫూర్తిదాయక ఘట్టం జరిగిన చోటే తన చిత్రపటానికి స్థానం దక్కడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఇటీవల భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌ను సైతం సచిన్ లార్డ్స్ మైదానంలో సంప్రదాయ గంటను మోగించి ప్రారంభించిన విషయం తెలిసిందే. క్రీడాకారుడిగా ఎన్నో రికార్డులు నెలకొల్పిన సచిన్‌కు, ఇప్పుడు లార్డ్స్ మ్యూజియంలో చిత్రపటం రూపంలో శాశ్వత స్థానం లభించడం ఆయన కీర్తికిరీటంలో మరో కలికితురాయిగా నిలిచింది.రత్, ఇంగ్లండ్

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## పాఠశాల తల్లిదండ్రుల కమిటీ

# పండుగ వాతావరణంలో జరుపుకోవడం గర్వకారణం

**- మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాస్ రావ్**




**కుప్పం -సూర్య వాస్తవం, జూలై 10:** విద్యార్థులు తమ తల్లిదండ్రులకు గ్రామానికి రాష్ట్రానికి, బాగా చదువుకున్న మంచి పేరు తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక కుప్పం పబ్లిక్ స్కూల్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తల్లిదండ్రుల పేరెంట్స్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ సమావేశాన్ని పండుగ వాతావరణం లో నిర్వహించడం తనకు గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మీరు ఎక్కడున్నా ఏం చేస్తున్నా మన దేశాన్ని మీరు చదివిన పాఠశాలను మీకు చదువు చెప్పిన గురువులను మీ తల్లిదండ్రులను మర్చిపోవద్దని హితవు పలికారు. పరీక్షల్లో పోటీ తత్వంతో చదవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృతంలో విద్యాశాఖ మంత్రి నారాయణ లోకేష్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ గిన్నిస్ రికార్డు దిశగా తీసుకెళ్లడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్య నేడు సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు వాటి అవకాశాలు అంది పుచ్చుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలు సరైన పద్ధతిలో చదువు తున్నారా లేదా అని పర్యవేక్షించాలని సూచించారు. తమ పిల్లలు టీవీలు, మొబైల్ ఫోన్లకు అంకితం కాకుండా చూడాలని వాటి వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని తెలిపారు. అనంతరం సామాజిక సేవ నేపథ్యం (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సి.ఎస్.ఆర్) ద్వారా ఐటిసి సంస్థకు చెందిన ప్రతినిధులు తమ సంస్థ తరపున ఉదారంగా పాఠశాల విద్యార్థుల అభివృద్ధి కోసం నిధులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ మెగా పేరెంట్స్ మీటింగ్ కమిటీ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రీడా పోటీలను నిర్వహించి వారికి కమిషనర్ చేతులమీదుగా మొక్కలు, బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం పబ్లిక్ స్కూల్ చైర్ పర్సన్ శాంత నాగరాజ్, ప్రిన్సిపల్ దమయంతి, లయన్స్ క్లబ్ కుప్పం అడ్వైసర్ మహేష్, ఐటీసీ సంస్థ ప్రతినిధులు సత్య శ్రీనివాస్, కుమారి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## గురు పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులు

- సతీమణి శ్రీలక్ష్మితో కలిసి మారుతీనగర్‌లోని బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు
- నగరంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బాబా కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్ష





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై,10:**గురుపౌర్ణమి సందర్భంగా అనంతపురంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన సతీమణి శ్రీలక్ష్మితో కలిసి మారుతీనగర్ లోని షిరిడి బాబా ఆలయానికి వెళ్లారు. అలాగే 3వ రోడ్డు, వేమన టెలిఫోన్ భవన్ వద్ద బాబా ఆలయాల్లో కూడా పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేకంగా అర్చనలు, పూజా కార్యక్రమాలు చేశారు. బాబా దర్శనం అనంతరం పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ శ్రీ శిరిడీ సాయి నాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. బాబా కృపా కటాక్షాలతో నగరాభివృద్ధి జరగాలని కోరుకున్నారు.

## విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

**- డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు లెనిన్ బాబు, సహ వ్యవస్థాపకులు న్యాయవాది నాగభూషణం రెడ్డి**



**ప్యాపిలి -సూర్య వాస్తవం,జులై 10:** ప్యాపిలి మండలం హుస్సేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు అన్వర్ భాషా, అధ్యక్షతన ఉపాధ్యాయ తల్లిదండ్రుల సమావేశం చాలా ఘనంగా నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవా ధ్యక్షులైన వై నాగేశ్వరరావు యాదవ్ , ప్రగతిశీల గాయకులు, సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవసాపకులైన లెనిన్‌బాబు, సహ వ్యవస్థాపకులు అయిన న్యాయవాది నాగభూషణం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు నైతిక విలువలు పెంపొం దించుకుంటూ, పెద్దలను గౌరవిస్తూ, ప్రకృతిని సంరక్షిస్తూ అభివృద్ధి పథంలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను 1981 1982 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హాస సభ్యులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లి దండ్రులు, 1981 1982 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ,ఎస్ఎంసి చైర్మన్ రవి ,గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగినది.

## కుప్పం నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నేత కే పి కే పళని మృతి



**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 10 :** కుప్పం నియోజకవర్గంలో జాతీయ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ కార్యకర్తలకు అండగా ఉండే సీనియర్ కాంగ్రెస్ నేత పళని అనారోగ్యంతో గురువారం మృతి చెందారు.ఆయన మృతి పట్ల కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభయులకు కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల గోపి, నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పళని కుప్పం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

## తల్లిదండ్రులు ఉపాధ్యా యుల ఆత్మీయ సమావే శం




**గుత్తి-సూర్య వాస్తవం,జులై10:** గుత్తి మండలం వన్నె దొడ్డిగ్రామంలో పేరెంట్స్ ప్రోగ్రాం జరిగింది. గౌరవ నీయులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచనల మేరకు గుమ్మ నూరు ఈశ్వర్ ఆదే శాల మేరకు. 10-07-2025 వన్నెదొడ్డి పేరెంట్స్ ప్రోగ్రాంలో వన్నెదొడ్డి తెలుగుదేశం నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మోడీ శ్రీనివాస్ యాదవ్.దొడ్డి నరేంద్ర యాద వ్.వైస్ సర్పంచ్.ఆరేటి కృష్ణ మూర్తి.సచివాలయ సిబ్బం ది వన్నె దొడ్డి స్కూల్ టీచర్స్, తల్లిదండ్రులు పిల్లలు పాల్గొ నడం జరిగింది.

## తహశీల్దార్ వేధింపులు

**- సర్వేయర్ ఆత్మహత్యాయత్నం**




**మదనపల్లె -సూర్య వాస్తవం, జూలై,10:** తహశీల్దార్ వేధింపులు తాళలేక మండల సర్వేయర్ తహశీల్దార్ ఆఫీసులోనే ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం మధ్యాహ్నం పెద్దమండెంలో కలకలం రేపింది. బాధితురాలి కథనం మేరకు.. మండల వర్క్ మీద తహసిల్దారు పై విజిట్ వచ్చిన మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ కు మండల డిప్యూటీ సర్వేయర్ షేక్ హసింతాజ్(32) మండలంలోని ఐదు బ్లాకులకు సంభందించిన సర్వే నివేదిక సాయంత్రం లోపు కంప్లీట్ చేసి ఇవ్వాలని తహశీల్దార్ తేజస్విని ఆదేశించడం జీర్ణించు కోలేక నిద్రమాత్రల మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే సహచరులు బాదితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ... వారం రోజులుగా తహసిల్దార్ మానసికంగా వేధింపులకు గురించేసిందని ఆరోపించడం విశేషం. ఈ విషయమై తహసిల్దార్ తేజస్విని వివరణ కోరగా.. తాను కేటాయించిన విధులను డిప్యూటీ సర్వేనిర్వర్తించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పారు. అంతేగాని ఆమెను తాను ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని దూషించలేదని తెలిపారు.

## పండుగలా మెగా పేరెంట్స్ మీటింగ్ కమిటీ సమావేశం



**కుప్పం -సూర్య వాస్తవం, జూలై 10:**ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు కుప్పం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ మీటింగ్ సమావేశం పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడీపీ కుప్పం నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షులు జాకీర్, పాఠశాల చైర్మన్ అల్లా బకష్, వైస్ చైర్మన్ రియాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, పర్యావరణంలో కాలుష్య నియంత్రణ కోసం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ప్రజా ప్రతినిధులు



**గుత్తి-సూర్య వాస్తవం,జులై10:** గుత్తి మునిసిపాలిటీ - పట్టణం యందు పలు పాఠశాలల యం దు తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొనిన ఆంధ్రప్రదేశ్ కార్మిక సం క్షేమ శాఖ ఛైర్మెన్ వెంకటశివుడు యాదవ్,మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా ఈ కార్యక్ర మంలో కమీషనర్ తల్లికి వందనం కార్యక్రమం షెడ్యూలు కార్యక్రమా లు,సాంస్కృతిక కార్యక్రమాలు,త ల్లి తండ్రులకు వివిధ ప్రతిభ కార్య కలాపాల్లో పాల్గొనిన వారికి,వి ద్యార్థులకు బహుమతులు అం దజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభు త్వం విద్యకు పెద్ద పీఠగా విద్యా ర్థులకు సూచనలుగా తల్లికి వం దనం కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన నిధి,భవిష్యత్తులో రేపటి దేశ అభివృద్ధిలో విద్యార్థులది ముఖ్య పాత్ర అన్నారు.అదే వి ధంగా తల్లితండ్రులకు,విద్య చె ప్పిన గురువులకు,పాఠశాలలకు మంచి పేరు తీసురావలని గురు పౌర్ణమి సందర్భంగా అందరికి శు భాకాంక్షలు అందజేశారు.ఈ కా ర్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రి న్సిపల్ ప్రశస్తకుమారి ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ సుం కన్న,పద్మవాని హై స్కూల్ ప్రిన్సి పల్ మహబూ భాషా అధ్యాపకు లు,గుత్తి టి.డి.పి అధ్యక్షుడు యం.కె చౌదరి,హాస్పిటల్ కమిటీ చై ర్మన్ చికెన్ శీనా,మోడల్ స్కూ ల్ కమిటీ చైర్మన్ పవన్ యాదవ్ శ్రీపురం సర్పంచ్ లింగమయ్య టి డిపి నాయకులు కార్యకర్తలు,వి ద్యార్థులు,తల్లితండ్రులు పెద్ద ఎ త్తున పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

**- రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

రాయచోటి-సూర్య వాస్తవం, జులై 10: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, యుజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.గురువారం మండలంలోని హసనపురం పంచాయతీ కొండవాండ్ల పల్లి లో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, లక్ష్మీ ప్రసాద్ రెడ్డి లు పర్యటించారు. .ఈ సందర్భంగా వారు గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వెంటనే పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. అనంతరం నాగిరెడ్డి ,వెంకటరామిరెడ్డి ఇచ్చిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగ సుబ్బారెడ్డి, సహదేవరెడ్డి, సురేందర్ రెడ్డి,మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )